ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు


5

బుధవారం 26 నవంబరు 2025



మదనపల్లె జిల్లాకు సీఎం ఆమోదం

- మంత్రుల కమిటీ ప్రతిపాదనలకు అంగీకారం
- కొత్తగా పీలేరు రెవెన్యూ డివిజన్
- ఒంటిమిట్ట, సిద్దవటం అన్నమయ్యకే
- కొత్త జిల్లా ఏర్పాటుతో మదనపల్లె వాసుల్లో హర్షం
- పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో సంబరాలు




మదనపల్లె వ్యూ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లె జిల్లాలు, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు సీఎం నిర్ణయించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం ఈ మార్పు చేర్పులకు ఆమోదముద్ర చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో మొత్తంగా 29 జిల్లాలు ఏర్పడనున్నాయి. ఇందులో 27వ జిల్లాగా మదనపల్లె ఏర్పడనుంది. అలాగే కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం తెలిపారు. కొత్తగా ఏర్పడే మదనపల్లె జిల్లాలో పీలేరు రెవెన్యూ డివిజన్ కొత్తగా ఏర్పాటు కానుంది. మదనపల్లె జిల్లా భౌగోళిక స్వరూపం ఇలా ఉండనుంది. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలు, మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండెం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు, పీలేరు రెవెన్యూ డివిజన్‌లో సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేవీ పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. మొత్తం 11.05 లక్షల జనాభాతో కొత్త జిల్లా ఏర్పడనుంది. మదనపల్లె కొత్త జిల్లాగా ఏర్పాటు కావడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పీలేరు రెవెన్యూ డివిజన్ కొత్తగా ఏర్పాటు కావడంతో స్థానికులు సంబరాలు జరుపుకున్నారు.

అన్నమయ్యలోకి ఒంటిమిట్ట, సిద్దవటం

ప్రస్తుతం కడప రెవెన్యూ డివిజన్, కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను రాజంపేట రెవెన్యూ డివిజన్, అన్నమయ్య జిల్లాలోకి కలపనున్నారు. దీంతో అన్నమయ్య జిల్లాలో చిన్నమండెం, సంబేపల్లె, సుండుపల్లె, వీరబల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రాయచోటి, రాజంపేట, నందలూరు, పెనగలూరు, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఒంటిమిట్ట, సిద్దవటంతో కలిపి 17 మండలాలు ఉండన్నాయి.



ఇక్కడి ప్రజల జీవిత కల నెరవేరింది



మదనపల్లె ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న జీవిత కల సాకారమైంది. ఎన్నికల హామీలో తాను చొరవ తీసుకుని మదనపల్లె జిల్లా అంశాన్ని అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాను. నా విన్నపాన్ని మన్నించిన అధినేత, నారా లోకేశ్ ఇద్దరూ హామీ ఇచ్చారు. దానిని ఇప్పుడు అమలు చేశారు. ఆ ప్రకటనను క్షేత్రస్థాయిలో అమలు చేయించడానికి కూడా తాను అసెంబ్లీలో పలుమార్లు లేవనెత్తాను. తనతో పాటు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా ఇందుకోసం గట్టి పోరాటమే చేశారు. నేను జీవితాంతం సీఎం చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటా. నియోజకవర్గ ప్రజల తరపున తాను సీఎం, మంత్రి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నా.

- ఎం.షాజహాన్‌బాషా, ఎమ్మెల్యే, మదనపల్లె

ఆలస్యంగానైనా న్యాయం జరిగింది



జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు ఉండీ ఎన్నో అన్యాయాలు, నిర్లక్ష్యానికి గురైన మదనపల్లెకు ఆలస్యంగానైనా న్యాయం జరిగింది. ఇందుకు కారణమైన గత పాలకుల పరిస్థితి మనం చూస్తూనే ఉన్నాం. జిల్లా ప్రకటనకు పోరాటం చేసిన జిల్లా సాధన సమితి, జేఏసీ సభ్యులకు నా కృతజ్ఞతలు. కొత్తగా వచ్చిన మూడు జిల్లాలతో కలిపి రాష్ట్రంలో 29 జిల్లాలు అయ్యాయి. ఇందులో సుదీర్ఘచరిత్ర ఉన్న మదనపల్లె జిల్లాను అన్ని అంశాల్లో సింహభాగంలో నిలపడానికి నా వంతుగా జనసేన తరపున కృషి చేస్తా. జిల్లా పోరాటంపై గత ప్రభుత్వం, పాలకులు పెట్టిన అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలని సీఎం చంద్రబాబునాయుడును కోరుతున్నా.

- గంగారపు రాందాస్‌చౌదరి, జనసేన రాయలసీమ కో-కన్వీనర్, మదనపల్లె

మదనపల్లె అభివృద్ధికి మంచి నిర్ణయం



దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్ కేంద్రమైన మదనపల్లె ఎప్పుడో జిల్లా కావాల్సి ఉంది. ఈ అంశాన్ని అప్పట్లో బ్రిటీష్ పాలకులే గుర్తించారు. అయితే వివిధ రాజకీయ, ఆర్థికపరమైన కారణాలతో మొదట్లో మరుగున పడగా, 2022లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో రాజకీయ స్వలాభం కోసం గత పాలకులు పక్కన పడేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మదనపల్లె అభివృద్ధికి మరెంతగానో దోహదపడుతుంది. మంత్రుల సబ్‌కమిటీలో సభ్యుడైన మంత్రి సత్యకుమార్‌యాదవ్ కూడా ఇందుకోసం గట్టిగా ప్రయత్నించారు. మిగిలిన సభ్యులపై కూడా ఒత్తిడి పెంచారు. ఆయన కూడా ఇక్కడి వారే కావడంతో కలిసొచ్చింది. కూటమి చేసిన మంచి పనుల్లో ఇది కూడా ఒకటి.

- చల్లపల్లె నరసింహారెడ్డి, బీజేపీ జాతీయ నేత, మదనపల్లె

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

- రూ.7.20 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత



పట్టుబడిన ఎర్రచందనం, స్మగ్లర్లతో కేవీ పల్లె పోలీసులు

పీలేరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలంలో అక్రమంగా తరలించడానికి సిద్ధం చేసిన రూ.7.20 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మండలంలోని నూతన కాలువ పంచాయతీ నల్లగుట్ట వద్ద అక్రమంగా తరలించడానికి ఎర్రచందనం దుంగలు సిద్ధంగా ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు ఆయన చెప్పారు. ఇందులో 144 కిలోల బరువు గల ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుబడిన వారిలో తిరుపతి జిల్లా యర్రావారిపాళ్యం మండలం యల్లమంద పంచాయతీ పరిధిలోని మద్దెలవారిపల్లెకు చెందిన పిల్లెల సురేంద్ర, దొమ్మయ్యగారిపల్లెకు చెందిన పత్తిపాటి త్యాగరాజు నాయుడు, బోయపల్లెకు చెందిన అంకెం రమణగా గుర్తించామన్నారు. వీరి వద్ద నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ రెడ్డిమోహన్, పీసీ పురుషోత్తం పాల్గొన్నారు.

జెండర్ రిసోర్సు సెంటర్లతో మహిళలకు భద్రత

- మదనపల్లెలో ప్రారంభించిన ఎమ్మెల్యే



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా చట్టాల అమలుకు, మహిళల రక్షణకు జిల్లాకే పరిమితమైన జెండర్ రిసోర్సు సెంటర్‌ను మండలాల్లో కూడా ఏర్పాటు చేయడం శుభపరిణామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ లింగ వివక్ష నిర్మూలన దినోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలాలు, గ్రామాల్లో జెండర్ రిసోర్సు సెంటర్లతో మహిళలకు భద్రత, సమస్యలకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నెల రోజులు జిల్లాలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలను హింసిస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేయాలన్నారు. జెండర్ రిసోర్సు సెంటర్లలో గ్రామాల్లో మహిళల సమస్యలను ప్రత్యేక అధికారుల బృందం ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. అనంతరం మహిళా సంఘాలు, అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం సత్యనారాయణ, ధర్మరాజు, ఏజీఎం సంతోశ్, సీడీపీవో నాగవేణి, జెండర్ ఏసీ గంగాధర్, సాంబశివ, ఏపీఎం ఖిజర్‌ఖాన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ధనార్జన కోసమే చేతులు కలిపాం

- విచారణలో కీలక విషయాలు వెల్లడించిన నిందితులు

6

నాడు భళా... నేడు బలి...!

- మామిడి తోటలను నరికివేస్తున్నరైతులు

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ నాగరాజ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజ

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజ తెలిపారు. మంగళవారం మదనపల్లె వన్, టూ డిపోలను సందర్శించిన ఆయన ఆర్టీసీ బస్టాండ్‌ను, గ్యారేజిని తనిఖీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం విజయవంతమైందన్నారు. బస్టాండులో ప్రయాణీకుల రద్దీ పెరిగిందని, దానికి అనుగుణంగా బస్టాండులో తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డిపో సిబ్బంది విజ్ఞప్తి మేరకు బస్టాండ్, గ్యారేజిలో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి రాము, వన్, టూ డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, అమరనాథ్, సూపర్‌వైజర్లు, అన్ని అసోసియేషన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీ-నీవాలోకి కానగలకుంట నీరు




కానగలకుంట నుంచి వెనక్కు వెళుతున్న నీరు

బి.కొత్తకోట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ శివారు బెంగళూరు రోడ్డులోని కానగలకుంట చెరువుకు నీటిని తరలించే జెర్రిపోతు కాల్వ మంగళవారం మరోసారి తెగింది. దీంతో చెరువులోకి రావాల్సిన నీరు సహా చెరువులోకి ఇప్పటికే చేరిన నీరు సైతం రివర్స్‌లో హంద్రీ-నీవా కాల్వలోకి వెళ్లిపోతున్నాయి. హంద్రీ-నీవా కాల్వ నిర్మాణంలోనే సాంకేతికలోపం కారణంగా కానగలకుంట లోనికి రావాల్సిన నీరు రాకపోగా, వచ్చిన నీరుసైతం వెనక్కు వెళతోంది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో స్థానికులు సొంత నిధులతో పనులు చేపట్టి జెర్రిపోతు కాల్వ ద్వారా కానగలకుంట నీరు చేరేలా చేశారు. దీంతో చెరువులోకి కొంత మేర నీరు చేరింది. తాజాగా మంగళవారం ఉదయం కాల్వ మళ్లీ తెగింది. దీంతో చెరువులోని నీరు వెనక్కి వెళ్లి హంద్రీ-నీవా కాల్వలో కలిసిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హామీ నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

- చిన్నమండెంలో ముగ్గురికి రూ.6.70 లక్షల అందజేత



మాలేపాటి ఈశ్వరకు చెక్కు అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 12వ తేదీ చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో ముగ్గురు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు బంగారు రుణాలు చెల్లించేందుకు రూ.6.70 లక్షల రూపాయల చెక్కులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం అందచేశారు. సీఎం చంద్రబాబు చిన్నమండెం వచ్చిన సందర్భంగా మాలేపాటి హేమలత, మాలేపాటి ఈశ్వర, ముంతాజ్ బేగంలు సీఎంతో మాట్లాడుతూ తాము బ్యాంకుల్లో బంగారం తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నామని దానిని తీర్చలేకున్నామని సీఎంకు చెప్పారు. దీంతో వెంటనే స్పందించిన చంద్రబాబు మీకు సాయం చేస్తానని హామీ ఇచ్చి, దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆ ముగ్గురికి మొత్తం 6 లక్షల 70 వేల రూపాయలు లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకున్నారు. మాలేపాటి హేమలతకు రూ.75 వేలు, మాలేపాటి ఈశ్వరకు రూ.1.26 లక్షలు, ముంతాజ్‌బేగంకు రూ.4.69 లక్షలకు సంబంధించి చెక్కులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం వారికి అందచేశారు. ఆ చెక్కులు బంగారు నగలు ఉన్న సంబంధిత బ్యాంకు వారికి అందే విధంగా చర్యలు చేపట్టారు.

డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు సస్పెన్షన్

- కిడ్నీ రాకెట్ కేసులో అరెస్టు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

కలికిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వైద్య సర్వీసుల ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లెలో ఆంజనేయులు కుటుంబీకులు నిర్వహిస్తున్న ప్రైవేటు వైద్యశాలలో అనధికార కిడ్నీ మార్పిడులు బహిర్గతమైన నేపథ్యంలో ఆంజనేయులును కూడా నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆయనను ఈనెల 16న పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో డిటెన్యూ ఖైదీగా ఉన్న ఆంజనేయులు 48 గంటలకు పైగా జైలులో ఉన్నందున నిబంధనల ప్రకారం 16వ తేదీ నుంచి సస్పెన్షన్ అమల్లోకి వచ్చే విధంగా ఆదేశాలను పరిగణించాలని ప్రభుత్వం పేర్కొంది. రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో అనస్తీషియా సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగుతున్నారు. కాగా ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు సస్పెన్షన్ ఉత్తర్వులు అమలులో ఉన్నంతకాలం మదనపల్లె వదిలి వెళ్లరాదని పేర్కొంటూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.



నిందితుల అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

కిడ్నీ కేసులో మరో ఇద్దరి అరెస్టు

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు మంగళవారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది నిందితులు అరెస్టు జాబితాలో చేరారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆస్పత్రిలో ఈనెల 9వ తేదీ కిడ్నీ మార్పిడి చేస్తుండగా ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసింది. ఈ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన కొండయ్య, సుమన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఇద్దరు నిందితులు కిడ్నీ శస్త్రచికిత్స చేసిన బెంగళూరుకు చెందిన వైద్యుడి సహాయకులుగా చెబుతున్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ రహిముల్లా పాల్గొన్నారు.

పీలేరులో సంబరాలు...

- రెవెన్యూ డివిజన్‌గా పీలేరు
- మాట నిలుపుకున్న చంద్రబాబు, నారా లోకేశ్
- నాలుగు రోడ్ల కూడలిలో కూటమి నేతల సంబరాలు



పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో కూటమి నేతల సంబరాలు

పీలేరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు మదనపల్లెను జిల్లాగా, పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించడంపై కూటమి నేతల సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం రాత్రి పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మదనపల్లె జిల్లాతో పాటు పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మదనపల్లె జిల్లా ఏర్పాటుతో పాటు పీలేరు రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ పలుమార్లు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లి సఫలీకృతం అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యెల్లెల రెడ్డెప్పరెడ్డి, పార్టీ నాయకులు ఎస్.అమరనాధరెడ్డి, శ్రీనాథరెడ్డి, గొళ్ల కిశోర్‌నాయుడు, కలప రవి, రామక్రిష్ణారెడ్డి, బోడింపల్లె సూరి, సురేంద్ర, మౌలా, సుభాష్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



పెద్దఎత్తున బాణాసంచా పేలుళ్లు

పల్లె దారికి అడ్డంగా మట్టి కుప్పలు

- అంబులెన్స్ వెళ్లే దారి కూడా లేదు...



మట్టి కుప్పలు అడ్డంగా ఉండటంతో గ్రామం వెలుపలే నిలిచిపోయిన అంబులెన్స్



కొనకుంట్లపల్లెకు వెళ్లే దారిలో అడ్డంగా వేసిన మట్టి కుప్పలు

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలు 40 ఏళ్లుగా నడిచే దారి స్థలం తమదే అంటూ కొందరు అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ దారిలో ఎవ్వరినీ వెళ్లనీయకుండా మట్టికుప్పలు అడ్డంగా వేశారు. చివరికి గ్రామంలోకి అత్యవసరంగా అంబులెన్స్ కూడా వచ్చేదారి లేక పేషెంట్‌ను మనుషులే మోసుకుని అంబులెన్స్ వద్దకు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ కొనకుంట్లవారిపల్లెకు బెంగళూరు జాతీయ రహదారి నుంచి దారి ఉంది. 40 ఏళ్లుగా గ్రామ ప్రజలు ఈ దారిలోనే నడిచేవారు. అంతేకాకుండా ఈ దారిలో 120 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు కూడా ప్రభుత్వ నిధులతో నిర్మించారు. కాగా ఈ దారి స్థలం తమదే అంటూ కొందరు ట్రాక్టర్‌తో మట్టిని కుప్పలుగా వేసి దారిని మూసేశారు. ఈ క్రమంలో మంగళవారం ఓ వృద్ధురాలికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో అంబులెన్స్‌ను పిలిపించారు. అంబులెన్స్ వెళ్లే దారిలేకపోవడంతో చివరికి వృద్ధురాలిని మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకెళ్లారు. దీనిపై గ్రామ ప్రజలు మాట్లాడుతూ అధికారులు తమ గ్రామ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరుతున్నారు.

నాడు భళా... నేడు బలి...!

- మామిడికి భారీగా ఆశిస్తున్న చీడపీడలు ● తగ్గిన దిగుబడులు
- ఎకరాలకు ఎకరాలు నరికివేస్తున్నరైతులు
- ప్రత్యామ్నాయ పంటల వైపు మామిడి రైతు చూపు

రైల్వేకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మామిడిలో రానురాను నష్టాలు వస్తుండటంతో చాలామంది రైతులు మామిడి చెట్లను నరికివేస్తున్నారు. నియోజకవర్గంలో 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగు ఉన్నాయి. అధికశాతం మంది రైతులు తోటలను నరికివేస్తున్నారు. ప్రతి సీజన్‌లో మామిడికి భారీ ఎత్తున చీడపీడలు పట్టిపీడిస్తున్నాయి. అదేవిధంగా దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉండేవి. రానురాను తోటలను రైతులు నరికివేయడంతో విస్తీర్ణం తగ్గిపోతోంది. అధిక దిగుబడులు, ఆదాయం వస్తున్న అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటల వైపు మామిడి రైతులు మొగ్గుచూపుతున్నారు. అదేకాకుండా మామిడి రైతులు కొత్త వంగడాలను కూడా సాగు చేసే పనిలో ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలకు పైబడి ఉన్న రైతులు మామిడి తోటలను నరికివేసి భూమిని లీజుకు ఇస్తున్నారు. టమోటాలు, వంగ, పచ్చిమిరప, పూలు రకాలైన సంపంగి, చెండుమల్లి, చామంతి, కనకాంబరం తదితర వాటిని సాగు చేస్తున్నారు. అలాగే డ్రాగన్‌ఫ్రూట్ తదితర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. రైల్వేకోడూరు మామిడి అంటే దక్షిణ భారతదేశంలోనే పేరు గాంచింది. ఇక్కడ బేనీషా, నీలం, రుమాణి, పులిహోరా, ఖాదర్, నీలీషాన్, మల్లికా, తోతాపూరి, నాటు రకాలు, రసాలు తదితర మామిడి కాయలను పండిస్తున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇదే కాకుండా చిత్తూరు జిల్లాలోని జ్యూస్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. మామిడిలో ఎక్కువగా నష్టాలు వస్తున్నాయని చాలామంది రైతులు తోటలను నరికివేస్తున్నారు. ఎకరాకు ప్రతి ఏటా రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు వస్తోంది. ఇదే పది ఎకరాలు ఉన్న రైతుకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు వస్తోంది. దున్నకాలు, కూలీలు, చీడపీడలకు మందులు, ఎరువులు తదితరాల ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక్క ఎకరాలో మామిడి బాగా వస్తే రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఆదాయం వస్తుంది. క్రిమి సంహారక మందులు ఎక్కువగా పిచికారి చేయడంతో తోటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తోటలను నరికివేయక తప్పడం లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల్లో ఆదాయం తగ్గడం తో రైతులు చేసిన అప్పులు తీరడం లేదు. దీంతో ప్రత్యామాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మామిడి అంతరించిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నరికివేసిన మామిడి కొయ్యలను కొయ్య వ్యాపారులు ఇటుక బట్టీలు తదితర వాటికి తరలిస్తున్నారు.

మామిడితో ఆదాయం తగ్గింది



మామిడితో ఆదాయం తగ్గింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గతంలో మామిడి తోటలే కనిపించేవి. ప్రస్తుతం గ్రామాల్లోకి వెళితే దూరంగా కనిపిస్తున్నాయి. దీనిని బట్టి రైతులకు ఆదాయం లేదని తెలిపిపోతుంది. అన్ని గ్రామాల్లో మామిడి తోటలను నరికివేస్తున్నారు. చీడీపీడలు అధికంగా వస్తున్నాయి. అదేకాకుండా ఎరువులు, పురుగు మందులకు డబ్బులు పెట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖర్చు ఎక్కువైంది. ఆదాయం తగ్గిపోయింది. దీంతో పది ఎకరాల మామిడి తోటను నరికివేశాను.

- కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వీఆర్ రాచపల్లె



మామిడి చెట్టును రంపంతో కోస్తున్న దృశ్యం



నరికివేసిన మామిడి చెట్టు



మామిడి మొద్దులను లారీకి లోడింగ్ చేస్తున్న కూలీలు

ఎకరాలకు ఎకరాలు నరికివేస్తున్నారు



ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో మామిడి తోటలను రైతులు నరికి వేస్తున్నారు. మండలంలో మామిడి పరిస్థితి ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. మామిడి తోటల్లో ఆదాయం వచ్చేదని చాలామంది రైతులు మామిడి తోటలను సాగు చేశారు. ప్రస్తుతం మామిడి తోటలతో ఆదాయం లేదని నరికివేస్తున్నారు.

- భాస్కర్, ఉద్యాన శాఖాధికారి, రైల్వేకోడూరు

క్రమశిక్షణ కలిగిన వారికే గుర్తింపు

నియోజకవర్గ సంస్థాగత కమిటీ పరిశీలకుడు దినేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దినేశ్‌రెడ్డి

పెద్దమండ్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) టీడీపీలో క్రమశిక్షణ కలిగి పార్టీ బలోపేతం చేసిన వారు గుర్తింపు పొందుతారని నియోజకవర్గ టీడీపీ సంస్థాగత కమిటీ ప్రధాన పరిశీలకుడు, ఎన్విరాన్‌మెంటల్ చైర్మన్ దినేశ్‌రెడ్డి తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం కలిచెర్లలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీలో 9 మంది, క్లస్టర్ స్థాయిలో నలుగురు పోటీలో ఉన్నట్లు తెలిపారు. టీడీపీ అధిష్టానం నిర్ణయం మేరకు మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, రాష్ట్ర నేతలు, మండల పరిశీలకులు దేవరింటి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, సర్పంచ్ నటరాజ్‌నాయక్, మండల మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, విశ్వనాథరెడ్డి, మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే కొండంత బలం

తంబళ్లపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి కొండంత బలం అని పార్టీ కోసం కష్టపడ్డ నేతలు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత తప్పక లభిస్తుందని టీడీపీ పరిశీలకుడు పి.దినేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లయ్యకొండ కింద టీడీపీ మండల కమిటీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు, కార్యకర్తలు వర్గ విభేదాలు వీడి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల వందశాతం విజయానికి కృషి చేయాలన్నారు. నేతలు, కార్యకర్తలు అందరికీ అందుబాటులో ఉండే నేతను ప్రతిపాదిస్తే అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం మండల కమిటీ ఎన్నికపై నేతలు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి, చిట్టిబాబు, వెంకటేష్, రెడ్డప్పరెడ్డి, డేరంగుల చంద్ర, తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, సోము పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు మదనపల్లె విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ తదితరులు

మదనపల్లె అర్బన్, నవంబరు 25((ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీవేద పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నీరుగట్టి మోక్షరెడ్డి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మహేంద్ర తెలిపారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మదనపల్లె మండలంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో అండర్-14 బాలబాలికల జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. ఇందులో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబరు 18 నుంచి ఝార్ఖండ్‌లోని రాంచి జరిగే ఏపీ జట్టు తరపున జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననుంది.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మట్లి, పెద్దూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.రెడ్డిగీత, సి.హేమశ్రీ, సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. నవంబరు 22 నుంచి 24వ తేదీ వరకు పులివెందులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రమణప్ప సత్రంలో జరిగిన పోటీల్లో కడప జిల్లా బాలుర, బాలికల జట్ల తరఫున వీరు ప్రతిభ కనపరిచారు. జనవరి నెలలో ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు వల్లూరు జయన్న తెలిపారు. వ్యాయామ సంచాలకుడు ఎ.జగదీశ్వరయ్యను ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ నాగేశ్వర, గ్రామ ప్రజలు అభినందించారు.

టైపిస్ట్ ప్రశాంత్‌నాయక్ సస్పెన్షన్

సుండుపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లను జారీ చేసిన టైపిస్ట్ ప్రశాంత్‌నాయక్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం సస్పెండ్ చేశారు. అక్రమంగా జారీ చేసిన 27 పొసెషన్ సర్టిఫికెట్లను, 4 రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ప్రశాంత్‌నాయక్ తహసీల్దార్ అనుమతి లేకుండా డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన ఘటనను తహసీల్దార్ తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై రాజంపేట సబ్ కలెక్టర్ భావన విచారించి దుర్వినియోగానికి పాల్పడటం నిజమని ఇచ్చిన నివేదిక మేరకు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ మహబూబ్ చాంద్ మాట్లాడుతూ తమ కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్టు ప్రశాంత్‌నాయక్ వీఆర్వో, ఆర్ఐల లాగిన్‌లో ఏ విధమైన విచారణ నివేదిక లేకుండా, డిజిటల్ కీని వినియోగించుకుని పొసెషన్ సర్టిఫికెట్లను అక్రమంగా జారీ చేశారని పేర్కొన్నారు. దుర్వినియోం జరిగిన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతో పాటు పోలీసు కేసు పెట్టామని తెలిపారు. దీంతో కలెక్టర్ టైపిస్టును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం జోలికొస్తే ఎవరినీ వదలం

కర్నూలు సీసీఎఫ్ కృష్ణమూర్తి



ఎర్రచందనం చెట్లను పరిశీలిస్తున్న సీసీఎఫ్ కృష్ణమూర్తి

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం జోలికి వెళితే ఎంతటివారినైనా సహించేది లేదని కర్నూల్ రేంజ్ సీసీఎఫ్ కృష్ణమూర్తి హెచ్చరించారు. సిద్దవటం మట్టిరాజుల కోటను, లంకమల అభయారణ్యంలోని శాంభవి బేస్ క్యాంపును మంగళవారం ఆయన పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశీలించామన్నారు. డీఎఫ్‌వో వినోద్‌కుమార్, బద్వేల్ సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద, రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పెంచల్‌రెడ్డి, హైమావతి, మధుబాబు, మరికొందరు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి : మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మదనపల్లె రోడ్డులోని ఎంఎన్ఎం ఫంక్షన్ హాల్‌లో టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి బలం, బలహీనత కార్యకర్తలేనని, నాయకులు మారినా పార్టీకి అండగా నిలిచేది కార్యకర్తలేనన్నారు. అందరి సహకారంతోనే పార్టీ బలోపేతం అవుతుందని తెలియజేశారు. అనంతరం మండలాల వారీగా ఇన్‌చార్జిలను ప్రకటించారు. సంబేపల్లె క్లస్టర్ ఇన్‌చార్జిగా దుద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా శివప్రసాద్‌రెడ్డి, గాలివీడు క్లస్టర్ ఇన్‌చార్జిగా శివారెడ్డి, మండల ఇన్‌చార్జిగా కుమార్‌రెడ్డి, రామాపురం క్లస్టన్ ఇన్‌చార్జిగా వినోద్‌కుమార్, మండల ఇన్‌చార్జిగా సురేంద్రారెడ్డి, రాయచోటి రూరల్ క్లస్టన్ ఇన్‌చార్జిగా గాజుల ఖాదర్‌బాషా, మండల ఇన్‌చార్జిగా సుధాకర్, చిన్నమండెం క్లస్టర్ ఇన్‌చార్జిగా మల్లికార్జున, మండల ఇన్‌చార్జిగా రెడ్డెప్ప, లక్కిరెడ్డిపల్లె మండల ఇన్‌చార్జిగా యనమల మదన్‌మోహన్‌ను నియమించారు. వీరి ప్రమాణస్వీకారంతో పాటు గ్రామ, కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం విలేకరులతో మాట్లాడారు.

'మిషన్ శక్తి'తో మహిళల ఆర్థికాభివృద్ధి

మహిళల ఆరికాభివృద్ధిలో భాగంగా మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇందులో భాగంగా పట్టణం లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పేద మహిళలకు కుట్టుయంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎంపీడీవో సురేశ్‌బాబు, రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అయోధ్యాపురం ఆంజనేయులు, పలువురు టీడీపీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : సంబేపల్లె మండలంలోని పీఎస్ కాలనీ నగిరిలో అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలుపుకుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ, ఏడీఏ శ్రీలత, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వెంకటమోహన్, మండల వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మట్లి శ్రీనివాస్‌నాయుడు, మాజీ సర్పంచ్ గోపాల్, సుబ్బరాజుయాదవ్, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్

చిన్నమండెం: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఫోన్ చేసి తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

రాయచోటి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ వెల్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మనియానాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గుర్రప్ప, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

రాజంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ ఏసీబీ దాడులకు గురైన రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వ్యవహారంపై మంగళవారం కడప విజిలెన్స్ ప్రత్యేక తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఇక్కడ అవినీతి ఆరోపణలు రోజురోజుకు ఎక్కువ కావడంతో దీనిపై విజిలెన్స్ అధికారులు పూర్తి స్థాయి విచారణకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఇందులో భాగంగా మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాని వచ్చిన విజిలెన్స్ అధికారులు కొన్ని రిజిస్ట్రేషన్‌లపై విచారణ చేసినట్లు తెలిసింది. ఒక వ్యక్తి చనిపోయిన నెల తర్వాత అతడి పేరిట రిజిస్ట్రేషన్ జరిగిన రిజిస్ట్రేషన్‌పై విచారణ చేసినట్లు తెలిసింది. స్టాంప్ రైటర్లు, వెండర్లు స్టాంపులను అధిక మొత్తంలో ఫిర్యాదులు రావడంతో దీనిపై ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి వ్యవహారం రోజురోజుకు మలుపు తిరుగుతోంది.

ధనార్జన కోసమే చేతులు కలిపాం

- విచారణలో కీలక విషయాలు వెల్లడించిన నిందితులు

ములకలచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక ధనార్జన కోసమే మద్దేపల్లి జనార్దన్‌రావుతో చేతులు కలిపామని, నకిలీ మద్యం తయారీ ఫార్ములా అమలు, స్పిరిట్ సరఫరా, నగదు చెల్లింపులు అన్నీ తామే దగ్గరుండి చూసుకున్నామని ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీలో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీ వెల్లడించారు. మదనపల్లెలోని ఎక్సైజ్ స్టేషన్‌లో రెండోరోజు ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై కస్టడీకి తీసుకున్న ఆరుగురు నిందితులను విచారించారు.

నకిలీ మద్యం తయారీలో కీలకంగా వ్యవహరించిన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టా రాజు, బెంగళూరుకు చెందిన బాలాజీలను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. పలుమార్లు ఇద్దరిని వేర్వేరుగా, తరువాత కలిసి విచారించి కీలక విషయాలు రాబట్టారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి నగదు చెల్లింపులు తానే చేశానని, 2025 జూన్‌లో నకిలీ మద్యం తయారీ ప్రారంభించామని, బెల్ట్‌షాపులకు నకిలి మద్యం పంపానని, మొత్తం వివరాలను లాప్‌ట్యాప్, డైరీలో రాశానని కట్టా రాజు వెల్లడించినట్లు తెలిసింది. అలాగే కస్టడీలో ఉన్న కొడాలి శ్రీనివాసరావు, అష్రఫ్, చైతన్యబాబు, సుదర్శన్‌లను కూడా విచారించారు. ములకలచెరువు కేంద్రంలో నకిలీ మద్యం తయారు చేయడానికి ఫార్ములా అమలు చేయడంతో పాటు స్పిరిట్ రవాణా చేసిన బాలాజికి రూ.1.77 కోట్లు ముట్టజెప్పినట్లు కట్టా రాజు ఎక్సైజ్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్‌రావుపై కేసు

ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్‌రావుతో పాటు మరో ముగ్గురిని నిందితులుగా చేర్చారు. తంబళ్లపల్లె కోర్టులో మెమో దాఖలు చేసి అనుమతి ఇవ్వడంతో జగన్‌మోహన్‌రావును ఏ26గా, ఏ27గా తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఏ28గా రమేష్‌బాబు, ఏ29గా అల్లాబక్ష్‌లను చేర్చారు. వీరందరూ ఇబ్రహీంపట్నం కేసులోనే నిందితులుగా ఉన్నారు. వీరు అరెస్టయి ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్నారు. దీంతో ములకలచెరువు నకిలీ మద్యం నిందితుల సంఖ్య 25 నుంచి 29కి చేరింది. కాగా ప్రధాన నిందితుడు జనార్దన్‌రావును అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు.

ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలో ఆలయాల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించినట్లు జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సుద్దలవాండ్లపల్లె, మినమ రెడ్డిగారిపల్లె, శంకరాపురం, జగనన్న కాలనీ, దుద్యాల పెద్దజంగంపల్లె ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించినట్లు తెలియజేశారు. ఆలయ నిర్వాహకుల దరఖాస్తులను పరిశీలించి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలను మంజూరు చేసి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో భక్తిభావం పెంపొందించే విధంగా ఆలయాలు నిర్మిస్తామని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఆలయ నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఏఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయమే ఉపాధి కార్యాలయం

- ఇరుకు గదుల్లో ఇబ్బందిగా ఉద్యోగం
- ఆరు నెలలుగా తప్పని తిప్పలు
- ఇదీ డీబ్ల్యుఎంఏ కార్యాలయం దుస్థితి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లా ఏర్పడి మూడు సంవత్సరాలు దాటినా జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేవు. ఒకే భవనంలోనే రెండు మూడు కార్యాలయాలు నడుస్తున్నాయి. రాజంపేట రోడ్డులో ఉన్న మైనార్టీ కమిటీ బిల్డింగ్‌లో డ్వామా కార్యాలయం అప్పట్లో ఏర్పాటు చేశారు. అయితే ఆ కళాశాలకు సంబంధించిన యాజమాన్యం రెండు సంవత్సరాలు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉండటానికి వీలు లేదని చెప్పింది. ఆ భవనంలో హడావుడిగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని దాదాపు మూడు సంవత్సరాలు కాలం వెల్లదీశారు. ఈ ఏడాది మే నెలలో అక్కడ ఉన్న కొన్ని కార్యాలయాలకు మైనార్టీ పాలిటెక్నిక్ యాజమాన్యం నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని చెప్పింది. దీంతో ఏం చేయాలో తెలియక హడావుడిగా దిగువ అబ్బవరం సచివాలయంలోకి డ్వామా కార్యాలయం రాత్రికి రాత్రి మార్చివేశారు. ఇక్కడ కనీస వసతులు కనుచూపు మేర లేవు. ఇరుకు గదిలో దాదాపు ఆరుగురు ఉద్యోగులు కూర్చుని పనిచేయాల్సి వస్తోంది. ఇక్కడ కొంతమంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. వారికి మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. జిల్లాలో అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే ఈ కార్యాలయానికి గూడు లేక నానా ఇబ్బందులు పడుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఉపాధి కార్యాలయం వారికి సరైన బిల్డింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు కోరుతున్నారు.

ఇబ్బందికరంగా ఉంది

మేము ఈ బిల్డింగ్‌లోకి వచ్చి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. ఇక్కడ మాకు సరిపడా గదులు లేవు. చాలా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్నాము. దిగువ అబ్బవరం సచివాలయంపైన బిల్డింగ్ మాత్రమే మాకు ఇచ్చి ఉన్నారు. కింద కూడా ఇచ్చి ఉంటే బాగుండేది. ఈ సచివాలయం కింద బిల్డింగ్‌లో ఉన్న ఉద్యోగులకు వెనుక ఉండే బిల్డింగ్ తయారు చేసి ఇస్తే బాగుంటుంది. అప్పుడు మాకు ఈ బిల్డింగ్ పూర్తిగా సరిపోతుంది. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి, మా డిపార్టుమెంట్ హెడ్ దృష్టికి కూడా తీసుకెళ్లాము.

- వెంకటరత్నం, డ్వామా పీడీ





సచివాలయంలో ఉన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం, చిన్న గదిలో విధుల్లో ఉన్న ఐదుగురు ఉద్యోగులు

మతిస్థిమితం లేని మహిళ మానసిక వైద్యశాలకు తరలింపు



మతిస్థిమితం లేని మహిళను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసు సిబ్బంది

చెన్నూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లె రోడ్డులో మతిస్థిమితం లేని మహిళను స్థానిక పోలీసులు మంగళవారం మనోబంధ్ ఫౌండేషన్ ద్వారా కడప నగరంలోని మానసిక వైద్యశాలలో చేర్పించారు. రెండు రోజులుగా ఆ మహిళ చెన్నూరు, కొక్కిరాయపల్లె గ్రామాల్లో తిరగడంతో పాటు ఆమె మాట్లాడే మాటలు కూడా అర్థం కాని ఇతర భాషల్లో ఉండడంతో ఆ మహిళను మతిస్థిమితం లేనిదని స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మహిళకు 30-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది.

జాతీయ స్థాయి పోటీలకు చంద్రమౌనిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం, తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చంద్రమౌనిక 69వ జాతీయ స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టులో చోటుదక్కించుకుంది. ఫిజికల్ డైరెక్టర్లు విజయలక్ష్మి, ఉమాదేవి పర్యవేక్షణలో నిరంతర సాధనతో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో మెరిసిన మౌనిక గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, ఎంఈవో రఫీక్ అహ్మద్, పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గంగనపల్లె విద్యార్థినులు



ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన గంగనపల్లె విద్యార్థినులు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో ఈనెల 24 నుండి 25 వరకు జరిగిన అండర్-17 బాలబాలికల 69వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. బాలికల పోల్‌వాల్ట్ విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు వి.ముబీనా ప్రథమ, వి.సాహిదా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. డిసెంబరు 13 నుండి 17 వరకు ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఎర్రచందనం చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితులకు తిరుపతి కోర్టు మంగళవారం శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ చెక్‌పోస్టు సమీపంలో 2014 సెప్టెంబరు 21వ తేదీన 40కేజీల బరువు ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న సంపంగి రఘురాం, భూపాలం నాగరాజు, పోలిశెట్టి చంద్రశేఖర్, కొర్లకుంట తారకరామిరెడ్డిలను అప్పటి ఎస్ఐ టి.సంజీవరెడ్డి పట్టుకుని అదే రోజున కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈనేపథ్యంలో 2017 జనవరి 16న కమలాపురం కోర్టు జడ్జి ఆరునెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అయితే నిందితులు తిరుపతి రెడ్ శాండల్ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. అయితే తిరుపతి కోర్టు జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం సదరు నిందితులకు కింది కోర్టు విధించిన ఆరునెలల జైలు శిక్షను అమలుపరచాలని ఆదేశించారు. నిందితులను, సాక్షులను హాజరుపరచడంలో కృషి చేసిన సీఐ విశ్వనాథరెడ్డి, తిరుపతి కోర్టు లైసన్ ఆఫీసర్ హెచ్‌సీ సుబ్బయ్య, ఎర్రగుంట్ల హోంగార్డు ఎం.పుష్పరాజ్‌ను ఉన్నతాధికారులు అభినందించినట్లు సీఐ తెలిపారు.

కలిసిరాని ఉల్లి, అరటి సాగు

ఉల్లి, అరటి పంటల సాగు రైతులకు అచ్చిరాలేదు. కిందటి సంవత్సరం ఈ పంటలు సాగు చేసిన రైతులు మంచి లాభాలు గడించారు. ఇదే బాటలో ధరలు కొనసాగుతాయని ఆశించిన పలువురు సాగుకు పూనుకున్నారు. పరిస్థితులు వికటించి నష్టాలను మూటకట్టుకున్నారు. మండల పరిధిలోని రామాపురం రైతులు ఆ గ్రామంలో ఉల్లి, అరటి సాగుతో ఇంచుమించు రూ.2 కోట్లు పెట్టుబడుల కింద వెచ్చించి నష్టపోయారు. ఒకేఒక్క గ్రామంలో రైతులు ఇలా భారీగా నష్టపోవడం అరుదు అని పలువురు భావిస్తున్నారు.

- రామాపురం రైతులకు రూ.2 కోట్ల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతాంగం



చెట్టుకే వదిలేసిన అరటి గెలలు

దువ్వూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో వ్యవసాయమే జీవనాధారంగా కొనసాగుతోంది. ఇక్కడి రైతులు పండ్లు, కూరగాయలు, పూల తోటలతో పాటు ఉల్లి, అరటి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు కూడా సాగు చేస్తారు. ఈ క్రమంలో మంచి లాభాలు కూడా గడిస్తుంటారు. కానీ ఈ సంవత్సరం మార్కెట్‌లో ఉల్లి, అరటి పంటలకు సరైన డిమాండ్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వీటిని సాగు చేసి పెద్ద మొత్తంలో నష్టాలను మూటగట్టుకున్నారు. సరాసరి ఇక్కడ 300 ఎకరాల్లో ఉల్లి, 60 ఎకరాల్లో అరటి తోటలు సాగు చేశారు. పెట్టుబడుల కింద వీటి సాగుకు పెద్ద మొత్తంలో ఖర్చు అయింది. అయితే ఈ ఏడాది పొలంలో కురిసిన అధిక వర్షాలు, ఇతరత్రా కారణాల కారణంగా నేలలోనే ఉల్లిని, చెట్లపైనే అరటి గెలలను కొన్ని తోటల్లో గాలికొదిలేశారు. మరికొన్ని తోటలు ఇంకాకాపునకు రాలేదు. ఎకరాకు సరాసరి రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. ఉల్లి సాగుకు రూ.60వేలకు పైగా ఖర్చు వచ్చిందని చెబుతున్నారు. ఈ ప్రకారం రామాపురం గ్రామంలోని రైతులకు రూ.2 కోట్లు దాకా పెట్టుబడులకే వెచ్చించినట్లు తేటతెల్లం అవుతోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా కొనుగోలు జరుగకపోవడంతో చిల్లిగవ్వ కూడా చేతికందలేదని బావురమంటున్నారు.



పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

చిల్లిగవ్వ కూడా చేతికి అందలేదు..



అయిదు ఎకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి వేస్తే చిల్లిగవ్వ కూడా చేతికందలేదు. రూ.3 లక్షలు సాగు ఖర్చుల కింద వెచ్చించాను. పంటను నేలకొదిలేశాను. అప్పులు మూటగట్టుకున్నాను. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

- వైకుంఠం ఆంజనేయులు, రామాపురం

రూ.2.50 కోట్లు నష్టపోయాం..



మా ఊరిలో ఉల్లి, అరటి సాగు చేసిన రైతులు సుమారుగా రూ.2.50 కోట్లు నష్టపోయారు. వెనుక అదును వేసిన అరటి ఇంకా కాపు రాలేదు. ముందుగా వేసిన తోటల్లో గెలలు మాగడంతో గొర్రెల మేత కోసం వదిలేశాం. లేత తోటల్లో కాపు సమయానికి ధర వస్తుందని ఆశిస్తున్నాం.

- గుర్రం కొండలరావు, రామాపురం రైతు

ఎంపీ సీఎం రమేష్‌కు ఎమ్మెల్యేల పరామర్శ



అనకాపల్లి ఎంపి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ రాజు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎంరమేష్‌ను పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పోట్లదుర్తిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి రత్నమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వారంరోజులుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆమెను పోట్లదుర్తికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి ఇప్పటికి క్రిటికల్‌గానే ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎం.లింగారెడ్డి, షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, పలువురు ప్రముఖులు రత్నమ్మను మంగళవారం పరామర్శించి ఆమె ఆరోగ్యంపై ఎంపీ సీఎం రమేశ్‌ను, రమేశ్ తండ్రి మునిస్వామినాయుడుని, సీఎం సురేశ్, సీఎం రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం



వడ్డిబోయిన ప్రసాద్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేలు పట్టణానికి చెందిన వడ్డిబోయిన ప్రసాద్‌రెడ్డి నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బద్వేలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నన్ను ఎంతగానో ఆదరిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న బద్వేలు నియోజకవర్గ ప్రజానికానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ప్రారంభమైన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం నుండి కడపలో ప్రారంభమయ్యాయి. నగర శివారులోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టాఫ్ నార్త్ జోన్- రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్ల మధ్య సాగింది. తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ నార్త్‌జోన్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పి.పండిత్ 97 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్ చేపట్టి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 41 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మరో 220 పరుగుల వెనుకబడి వుంది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నార్త్‌జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 276 పరుగుల భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కేపీ శ్రీరామ్ 177 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టాఫ్ సౌత్‌జోన్-సెంట్రల్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్టాఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్ చేపట్టి 66.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 224 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె.కిశాల్ 74 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ఇందులో కె. థమన్‌సాయి 33 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో జిల్లా జట్టు



ట్రోఫీతో కడప జిల్లా బాలుర జట్టు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈనెల 23 నుండి 26 వరకు జరిగిన ఏపీ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలురు జట్టు విజేతగా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు వెల్లడించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ములకలచెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నిపుణులు రత్నశేఖర్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించిన వారు మాట్లాడుతూ గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, కృష్ణప్ప, జయచంద్రారెడ్డి, రేష్మా, అల్తాఫ్‌భాను, నిర్మలమ్మ, నోములమ్మ, హెల్పింగ్ మైండ్స్ ఇన్‌చార్జి ముస్తఫా పఠాన్ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఆర్టీసీ బస్టాండ్

- పై పూతలతో మ..మ.. అనిపిస్తున్న వైనం
- శ్రద్ధ చూపని డిపో అధికారులు



కడప బస్టాండ్ ప్లాట్‌ఫాం పైకప్పు దుస్థితి

కడప మారుతీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అది ఆర్టీసీ కడప రీజియన్‌కు గుండెకాయ లాంటి కడప డిపో. నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో సందడిగా వుంటుంది. కడప డిపో బస్సులే కాకుండా రీజియన్ పరిధిలోని మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల నుండి, అలాగే తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికుల తాకిడి మరీ ఎక్కువగా వుంటుంది. ఇదిలా వుండగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో గత ఆగస్టు 15 నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య మరింతగా పెరగడంతో బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. అందుకు తగ్గట్టుగా బస్టాండ్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం మంచి నీరు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా వుంచే ఏర్పాట్ల విషయంగా ఆయా డిపోల అధికారులు దృష్టిసారించాల్సి వుంది. అంతేకాకుండా బస్సుల రాక కోసం వేచివుండే ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలు, ఫ్యాన్లు వున్నాయి కానీ బస్టాండు బిల్డింగ్ మాత్రం అక్కడక్కడా పెచ్చులూడుతోంది. ఈ తంతు గత రెండు, మూడు సంవత్సరాలుగా సాగుతున్నా పై..పై పూతలతో మసి పూసి మారేడుకాయను చేసినట్లుగా మ....మ... అనిపిస్తున్నారు. బస్టాండ్ భవనంలోకి ప్రవేశించగానే కనిపించే కుడి వైపున ఉన్న గదులు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఆ రూముల పైభాగం పెచ్చులు కింద పడేందుకు సిద్ధం అన్నట్లుగా వున్నాయి. వర్షం వస్తే చాలు బస్టాండ్ ఏటీఎం వద్దనున్న కిరాణా షాపుల వద్ద వర్షపునీరు పై నుంచి కురుస్తుంది. వర్షపు నీరు కింద పడకుండా ఎన్ని తూ..తూ మంత్రాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆ కోవలో బస్టాండ్‌లో బస్సులు నిల్చునే ప్లాట్‌ఫారం భవనం పైకప్పు అక్కడక్కడా పెచ్చులూడుతోంది. పై..పై మరమ్మతులతో సరిపెడుతున్నా పెచ్చులూడడం పరిపాటిగా మారింది. ఇటీవల కొంత భాగం పెచ్చులూడడంతో పైపై మెరుగులు దిద్దేందుకు పూనుకున్నారే కానీ ఎందుకో పని మొదలెట్టలేదనే వాదనలున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా వుండే ఆర్టీసీ కడప బస్టాండ్ భవనం పెచ్చులూడే స్థితికి చేరుకున్నందున భవనానికి సరైన మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం దుస్థితి



టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్కంఠగా అంతర్‌కళాశాలల క్రీడలు

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో జరుగుతున్న అంతర్‌కళాశాలల క్రీడా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. మంగళవారం వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. చెస్ ఫైనల్స్ పోటీల్లో ఉదయగిరి వ్యవసాయ కళాశాల, క్యారమ్స్ ఫైనల్స్‌లో బాపట్ల ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాల, బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో నైరా వ్యవసాయ కళాశాల, జట్టు విజయం సాధించాయి. అలాగే బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, 19 కళాశాలల స్టూడెంట్ యాక్టివిటీ అధికారులు, పీడీలు, సిబ్బంది హాజరయ్యారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోపీకృష్ణ

సీకేదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగ అధిపతి డాక్టర్ టి.గోపీకృష్ణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సాంకేతిక కార్యక్రమాలపై మంగళవారం సమీక్ష నిర్వహించి శాస్త్రవేత్తలకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం చింతకొమ్మదిన్నె మండలంలోని అసోసియేషన్ డీన్ ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డితో కలిసి ఇప్పెంట, జమాల్‌పల్లి గ్రామాల్లోని విద్యార్థులు క్షేత్రస్థాయిలో పొందుతున్న విజ్ఞానాన్ని, స్థానిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకుని అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యాన్ని పొందాలన్నారు. అనంతరం కేవీకే సిబ్బందితో కలిసి వర్మీకంపోస్టు కేంద్రాన్ని, పుట్టగొడుగుల పెంపకం, కోళ్లపెంపకం, గొర్రెలు, మేకల పెంపక కేంద్రాన్ని పరిశీలించారు. చిరుధాన్యాలకు విలువ జోడింపు కేంద్రాన్ని, యంత్రపరికరాలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కేవీకే, డాట్‌సెంటర్ సమన్వయకర్తలు అంకయ్యకుమార్, కృష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సీకేదిన్నె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిపై మద్దిమడుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ కరిమున్నీసా (32) మృతి చెందగా ఆమె భర్త పీరు బాషా, కుమార్తెకు గాయాలయ్యాయి. మంగళవారం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మద్దిమడుగు దాటిన తర్వాత ఘాట్ సమీపంలో రాయచోటి వైపు నుండి కడపకు వస్తున్న లారీ, కడప నుండి రాయచోటికి వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో కిందపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని అంగడివీధికి చెందిన కరిమున్నీసా అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అటువైపు వెళ్లే వాహనదారులు సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన రాత్రి 8 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కరిమున్నీసా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తాళలేక రైతు ఆత్మహత్య

- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



చెన్నారెడ్డి (ఫైల్)

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం యాదవకుంట గ్రామానికి చెందిన వల్లెపు చెన్నారెడ్డి అనే రైతు వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం చెన్నారెడ్డి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిన లేఖ లభ్యమైంది. కుటుంబీకులు, ఆత్మహత్య నోట్ ప్రకారం వివరాల్లోకెళితే... వేముల మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన బాలగంగిరెడ్డి, ఓబుల్‌రెడ్డిల దగ్గర సుమారు రూ.1.80లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఒకరి వద్ద రూ.80వేలకు గాను వడ్డీతో కలిపి దాదాపు రూ.4లక్షలు చెల్లించాడు. అలాగే మరో వ్యక్తి వద్ద లక్ష రూపాయలు తీసుకున్నందుకు రూ.6 లక్షలకు బాండు రాయించుకున్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారస్తుల నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతోపాటు ఇంటి వద్దకు వచ్చి తీవ్ర ఒత్తిడి చేయడం వల్ల విష పుగుళికలు తిని ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో చెన్నారెడ్డి పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



చెన్నారెడ్డి రాసిన సూసైడ్ నోట్

ఇసుక అక్రమ రవాణాపై పోలీసు దాడులు

- రెండు ఎక్స్‌కవేటర్లు, 6 ట్రాక్టర్లు, రెండు టిప్పర్ల పట్టివేత



ప్రొద్దుటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పెన్నానది నుండి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రూరల్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో చౌడూరు గ్రామ పరిధిలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుకను ఎక్స్‌కవేటర్లతో ట్రాక్టర్లు, టిప్పర్లకు లోడ్ చేసి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాలకు తరలిస్తుండంతో దాడులు నిర్వహించారు. పోలీసుల దాడులతో ట్రాక్టర్లను, టిప్పర్లను వదిలేసి డ్రైవర్లు పరారయ్యారు. దీంతో రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసు స్టేషనుకు తరలించారు. ఈ ఇసుక అక్రమ రవాణాలో పద్మనాభరెడ్డితో పాటు మరికొందరు వున్నట్లు పోలీసులు వెల్లడిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్లు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం


● ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా

రైల్వేకోడూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకే ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. గత ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని హెచ్ఎంఎంహైస్కూలు ఆవరణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించి 150 మంది పేదలకు తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లను చేయించి మంగళవారం సురక్షితంగా రైల్వేకోడూరుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి చికిత్సలు, ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పేదల సంక్షేమం కోసమే తాము పని చేస్తామని తెలిపారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వేకోడూరు వరకు చేర్చి, భోజనాలు ఏర్పాటు చేయించి వారి, వారి ఇళ్లకు పంపామన్నారు. కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారిని ప్రత్యేకంగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆపరేషన్లు చేయించుకున్న వారిని పరామర్శిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

సబ్‌జైల్‌లో జడ్జి తనిఖీలు

రాజంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్‌జడ్జి బాబాఫకృద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను పరామర్శించారు. వారికి అందుతున్న న్యాయ సహాయం, ఆరోగ్య సమస్యలను, ఆహారం సరైన సమయంలో అందిస్తున్నారా తదితర అంశాలను ఆరా తీశారు. ఖైదీలకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. న్యాయవాదులను పెట్టుకోలేని ఖైదీలకుప్రభుత్వం తరపున న్యాయవాదులను నియమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పి.కాశీవిశ్వనాథ్, జైలు సూపరింటెండెంట్ ఇంతియాజ్, జైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలపై వివక్ష తగదు

● లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన ర్యాలీలో అధికారులు


లక్కిరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై వివక్ష తగదని పురుషులతో పాట సమానంగా చూడాలని ఎంపీడీవో రెడ్డెయ్య సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జెండర్ క్యాంపైన్‌లో భాగంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. విద్యావంతురాలైన మహిళ ఉన్న ఇంట్లో అందరూ విద్యావంతులవుతారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, ఏఎస్ఐ మస్తాన్, ఏపీయం నిరంజన్, మహిళలు పాల్గొన్నారు.

వీరబల్లి : జెండర్ తారతమ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి తెలిపారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 24 వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా. మండలంలోని 25 గ్రామ సమాఖ్యల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి జెండర్ మధ్య తేడాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ సమాఖ్యల సిబ్బంది స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో ఈ అంశం అజెండాలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలో ఎంపీడీవో జయశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, మహిళా నాయకత్వం, దేశ ఆర్థిక అభ్యున్నతికి మహిళల తోడ్పాటు అనే అంశాలపై ఎంపీడీవో సభాభవనంలో జరిగిన సమావేశంలో మహిళలకు బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.


వీరబల్లిలో మానవహారం ఏర్పాటు చేసిన మహిళలు

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని వెలుగు సమాఖ్య కార్యాలయం పరిధిలోని వీధుల్లో జెండర్ ఆధారిత వివక్షతపై జాతీయ ర్యాలీని ఏపీఎం మల్లికార్జునరాజు నిర్వహించారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 24 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేసి మండల పరిదిలో ఉన్న వీవోల పరిధిలో ప్రతి రోజు మహిళల భద్రత, విద్య, బాల్య వివాహాలు వంటివాటిపై అవగాహన కల్పించాలని తెలిపారు. జెండర్ సమస్యలు ఉంటే మండల సమాఖ్య దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుణవతి ఆధ్వర్యంలో ఏపీఎం మల్లికార్జునరాజు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈవోఆర్డీ రామ్మోహన్‌రెడ్డి,వైడీపీ ఏపీఎం రామచంద్ర, సీసీలు హరి, హరిబాబు, దామోదర్, గోవిందమ్మ, ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం


మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దూళ్లవారిపల్లెలో మంగళవారం ఏపీ మోడల్ స్కూల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలునాటారు. ఈ సందర్భంగా శిబ్యాల గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకట్రమణ మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షించడం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సామాజిక బాధ్యతన్నారు. గ్రామ పరిధిలోని కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రసన్నకుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం


చెత్తబుట్టల వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిట్వేలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం 78వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తబుట్టలను సరైన రీతిలో ఉపయోగించడం ఎలా అనే అంశంపై సెమినార్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సెమినార్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కేడెట్‌లు స్థాయి సుజిత్, భరత్, కార్తీక్, ముస్కాన్, వశిష్టలకు దాత జానీతో కలిసి సీనియర్ ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి



రామాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా చిట్లూరు గ్రామం ముసలిరెడ్డిగారి పల్లెకు చెందిన గాలివీటి సురేందర్‌రెడ్డి ఎంపికయ్యారు. దీంతో స్థానిక నాయకులు ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, జిల్లా కార్యదర్శి రమణ కోరారు. మంగళవారం పట్టణంలోని ఐటీఐ కళాశాల విద్యార్థులతో కలిసి మహాసభల గోడపత్రాలను విడుదల చేశారు. రైల్వేకోడూరు వేదికగా డిసెంబరు 7, 8 తేదీల్లో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన శాఖ మినహా అన్నిశాఖల పనులు చేస్తున్నారని విద్యారంగాన్ని పూర్తిగా గాలి కొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవన్నారు. నిర్వహించే మహాసభలకు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ స్పెషలాఫీసర్ ఉషారాణి తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి ప్రయోజకుడు అయినప్పుడే తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు, ఆ పాఠశాలకు పేరు వస్తుందన్నారు. 2025-26 సంవత్సరంలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించినప్పుడే పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ వరాల రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం'

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఏర్పాటు చేసి పెద్ద పట్టణాలకు దీటుగా రాయచోటిని అభివృద్ధి వైపు నడిపించానని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మున్సిపాలిటీలోని 1, 2, 34 వార్డుల్లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతో పాటు అన్ని కార్యాలయాలను రాయచోటికి తీసుకువచ్చామని గుర్తు చేశారు. కార్యకర్తలు పార్టీకి మూల స్థంభాలు లాంటివారని, వారికి అన్యాయం సహించమన్నారు. పార్టీ కమిటీల బలోపేతానికి దిశానిర్దేశం చేస్తూ అన్ని సామాజిక వర్గాల కమిటీలను బలోపేతం చేయాలని, త్వరలోనే వారికి గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు. మున్సిపల్ ఛైర్మెన్ ఫయాజ్‌బాషా, వైసీపీ పట్టణ అధ్యక్షుడు నవాజ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కందుల గుండయ్యనాయుడు మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి
సంతాపం వ్యక్తం చేస్తున్న పంతగాని


చిట్వేలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ కందుల గుండయ్యనాయుడు మంగళవారం ఉదయం మృతి చెందారు. టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎనలేని సేవలందించారు. సర్పంచ్‌గా రెండు సార్లు, ఎంపీపీగా పనిచేశారు. ఆయన సతీమణి కందుల చెంగమ్మ కూడా ఎంపీపీగా సేవలందించారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తీరని లోటు: పంతగాని

గుండయ్యనాయుడు మరణం తెలుగుదేశంపార్టీకి తీరనిలోటు అని రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులకు సాను భూతి తెలియజేశారు.

పలువురి నివాళి

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గుండయ్యనాయుడు చేసిన సేవలను స్మరించుకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి'


తహసీల్దారుతో చర్చిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

నందలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారునికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో భూ ఆక్రమణలను తొలగించి పేదలకు పంపిణీ చేయాలని, రైతుల సమస్యలపై అధికారులు వేగంగా స్పందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, సుబ్బనరసయ్య, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రైతన్న మీకోసం' ఆకస్మిక తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రనాయక్

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రనాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని మండలంలోని కడపాయపల్లెలో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది వాట్సాప్ చానల్‌లో ఔత్సాహిక రైతులను వ్యవసాయ అనుబంధ రంగాల సిబ్బందిని చేర్పించాలని తెలియజేశారు. అనంతరం సెంట్రల్ కిచెన్ నిర్మాణ పనులను పరిశీలించారు .

పశుగ్రాసం సాగుకు 100 శాతం రాయితీ

సుండుపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం సాగు చేసే రైతులకు ప్రభుత్వం వందశాతం రాయితీ ఇస్తోందని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. రైతన్న నీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పశుగ్రాసం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.. 50 సెంట్లలో సాగుకు రూ.32,992, 40 సెంట్లకు రూ.26,394, 30 సెంట్లకు రూ.13,197, 10 సెంట్లకు రూ.6,599 ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. వ్యక్తిగతంగా రైతులు 10 సెంట్లు నుంచి 50 సెంట్ల వరకు సాగు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమం పశుసంవర్థకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు

సుండుపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రుబీనా తెలిపారు. మంగళవారం మండలంలోని రాయవరం వైద్యశాలలో చైల్డ్‌ఫండ్ ఇండియా వర్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వీరనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలను పాడు చేసుకోవద్దు

రాయచోటిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని రాయచోటి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలపై బాలికలకు అవగాహన కల్పించారు. స్టెప్ ఇన్‌చార్జి సీఈవో వీబీ సుబ్బరాయుడు మాట్లాడుతూ మన దేశాన్ని మాదక ద్రవ్యాల వినియోగం నుంచి విముక్తి చేసే లక్ష్యాన్ని సాధించడానికి సమష్టి ప్రయత్నాలు అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను, ఉపాధ్యాయులు, స్టెప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యాధికారుల తనిఖీలు

రైల్వేకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గల్లా ఆస్పత్రిలో మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శేఖర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ఉషశ్రీ మాట్లాడుతూ ఆస్పత్రిలో నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది సర్టిఫికెట్లు పరిశీలించామని తెలిపారు. కొన్ని రోజులుగా స్కానింగ్‌కు సంబంధించిన నిపుణుడు లేనందున తాత్కాలికంగా సీజ్ చేశామన్నారు. ఆస్పత్రికిచెందిన రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. విచారణ సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ బృందంలో డాక్టర్ రమేశ్, దేవశిరోమణి, బాలకృష్ణంరాజు, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రైల్వేకోడూరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు పీఎఫ్‌ను వెంటనే చెల్లించాలని ఆర్ఎంటీయూ (రివల్యూషనరీ మార్కిస్ట్ ట్రేడ్ యూనియన్) జిల్లా కన్వీనర్ దాసరి జయచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వార్డు సభ్యుడు పోతురాజు నవీన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు చెన్నయ్య, యానాదమ్మ, కనకయ్య, పెంచలమ్మ, పెంచలయ్య, గజ, తేజ, శేషాద్రి, జయరామయ్య, పార్వతి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లపై కార్మికులకు అవగాహన

ఓబులవారిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ మంగంపేట సభాభవనంలో మంగంపేట ఉద్యోగులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్‌కోడ్ బిల్లులపై నెల్లూరు డీజీఎంఎస్ అధికారి కిశోర్‌కుమార్ అవగాహన కల్పించారు. ఏపీఎండీసీ సీపీవో గోపినాథ్ ఆధ్వర్యంలో అధికారులు కార్మికుల చట్టాలను వివరించారు. అనంతరం సందేహాలు నివృత్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోడ్‌లను అనుసరించి ఉద్యోగులు, కార్మికులు వారికి రావాల్సిన బెనిఫిట్‌లు, సౌకర్యాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ అధికారులు, యూనియన్ లీడర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తల్లికివందనం, స్కాలర్‌షిప్ వంటి పథకాలు అమలు సందర్భంగా ఆధార్‌కు సంబంధించిన సాంకేతిక ఇబ్బందులు ఎదురైనప్పుడు బయట ఉన్న ఆధార్ సెంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండాచేసేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం టక్కోలు జడ్పీహెచ్ఎస్‌లో ఆధార్ సెంటర్లను నిర్వహించారు. పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, పంచాయతి కార్యదర్శి నాగలింగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న అనుంపల్లి

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేదామని రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుం పల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పీలేరు నియోజకవర్గం మారేళ్లపల్లి పంచాయతీ 29వ పోలింగ్ కేంద్రం పరిధిలోని టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్, బూత్ కమిటీ, గ్రామ పార్టీ అధ్యక్షుల సమన్వయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ మనుగడకు కార్యకర్తలే కీలకమన్నారు. రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని చెప్పారు.

నాడు భళా... నేడు బలి...!

- మామిడికి భారీగా ఆశిస్తున్న చీడపీడలు ● తగ్గిన దిగుబడులు
- ఎకరాలకు ఎకరాలు నరికివేస్తున్నరైతులు
- ప్రత్యామ్నాయ పంటల వైపు మామిడి రైతు చూపు

రైల్వేకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మామిడిలో రానురాను నష్టాలు వస్తుండటంతో చాలామంది రైతులు మామిడి చెట్లను నరికివేస్తున్నారు. నియోజకవర్గంలో 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగు ఉన్నాయి. అధికశాతం మంది రైతులు తోటలను నరికివేస్తున్నారు. ప్రతి సీజన్‌లో మామిడికి భారీ ఎత్తున చీడపీడలు పట్టిపీడిస్తున్నాయి. అదేవిధంగా దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉండేవి. రానురాను తోటలను రైతులు నరికివేయడంతో విస్తీర్ణం తగ్గిపోతోంది. అధిక దిగుబడులు, ఆదాయం వస్తున్న అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటల వైపు మామిడి రైతులు మొగ్గుచూపుతున్నారు. అదేకాకుండా మామిడి రైతులు కొత్త వంగడాలను కూడా సాగు చేసే పనిలో ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలకు పైబడి ఉన్న రైతులు మామిడి తోటలను నరికివేసి భూమిని లీజుకు ఇస్తున్నారు. టమోటాలు, వంగ, పచ్చిమిరప, పూలు రకాలైన సంపంగి, చెండుమల్లి, చామంతి, కనకాంబరం తదితర వాటిని సాగు చేస్తున్నారు. అలాగే డ్రాగన్‌ఫ్రూట్ తదితర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. రైల్వేకోడూరు మామిడి అంటే దక్షిణ భారతదేశంలోనే పేరుగాంచింది. ఇక్కడ బేనీషా, నీలం, రుమాణి, పులిహోరా, ఖాదర్, నీలీషాన్, మల్లికా, తోతాపూరి, నాటు రకాలు, రసాలు తదితర మామిడి కాయలను పండిస్తున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇదే కాకుండా చిత్తూరు జిల్లాలోని జ్యూస్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. మామిడిలో ఎక్కువగా నష్టాలు వస్తున్నాయని చాలామంది రైతులు తోటలను నరికివేస్తున్నారు. ఎకరాకు ప్రతి ఏటా రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు వస్తోంది. ఇదే పది ఎకరాలు ఉన్న రైతుకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు వస్తోంది. దున్నకాలు, కూలీలు, చీడపీడలకు మందులు, ఎరువులు తదితరాల ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక్క ఎకరాలో మామిడి బాగా వస్తే రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఆదాయం వస్తుంది. క్రిమి సంహారక మందులు ఎక్కువగా పిచికారి చేయడంతో తోటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తోటలను నరికివేయక తప్పడం లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల్లో ఆదాయం తగ్గడం తో రైతులు చేసిన అప్పులు తీరడం లేదు. దీంతో ప్రత్యామాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మామిడి అంతరించిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నరికివేసిన మామిడి కొయ్యలను కొయ్య వ్యాపారులు ఇటుక బట్టీలు తదితర వాటికి తరలిస్తున్నారు.

మామిడితో ఆదాయం తగ్గింది



మామిడితో ఆదాయం తగ్గింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గతంలో మామిడి తోటలే కనిపించేవి. ప్రస్తుతం గ్రామాల్లోకి వెళితే దూరంగా కనిపిస్తున్నాయి. దీనిని బట్టి రైతులకు ఆదాయం లేదని తెలిపిపోతుంది. అన్ని గ్రామాల్లో మామిడి తోటలను నరికివేస్తున్నారు. చీడీపీడలు అధికంగా వస్తున్నాయి. అదేకాకుండా ఎరువులు, పురుగు మందులకు డబ్బులు పెట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖర్చు ఎక్కువైంది. ఆదాయం తగ్గిపోయింది. దీంతో పది ఎకరాల మామిడి తోటను నరికివేశాను.

- కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వీఆర్ రాచపల్లె



మామిడి చెట్టును రంపంతో కోస్తున్న దృశ్యం

ఎకరాలకు ఎకరాలు నరికివేస్తున్నారు



ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో మామిడి తోటలను రైతులు నరికి వేస్తున్నారు. మండలంలో మామిడి పరిస్థితి ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. మామిడి తోటల్లో ఆదాయం వచ్చేదని చాలామంది రైతులు మామిడి తోటలను సాగు చేశారు. ప్రస్తుతం మామిడి తోటలతో ఆదాయం లేదని నరికివేస్తున్నారు.

- భాస్కర్, ఉద్యాన శాఖాధికారి, రైల్వేకోడూరు



నరికివేసిన మామిడి చెట్టు



మామిడి మొద్దులను లారీకి లోడింగ్ చేస్తున్న కూలీలు

క్రమశిక్షణ కలిగిన వారికే గుర్తింపు

నియోజకవర్గ సంస్థాగత కమిటీ పరిశీలకుడు దినేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దినేశ్‌రెడ్డి

పెద్దమండ్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) టీడీపీలో క్రమశిక్షణ కలిగి పార్టీ బలోపేతం చేసిన వారు గుర్తింపు పొందుతారని నియోజకవర్గ టీడీపీ సంస్థాగత కమిటీ ప్రధాన పరిశీలకుడు, ఎన్విరాన్‌మెంటల్ ఛైర్మన్ దినేశ్‌రెడ్డి తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం కలిచెర్లలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీలో 9 మంది, క్లస్టర్ స్థాయిలో నలుగురు పోటీలో ఉన్నట్లు తెలిపారు. టీడీపీ అధిష్ఠానం నిర్ణయం మేరకు మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, రాష్ట్ర నేతలు, మండల పరిశీలకులు దేవరింటి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, సర్పంచ్ నటరాజ్‌నాయక్, మండల మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, విశ్వనాథరెడ్డి, మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే కొండంత బలం

తంబళ్లపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి కొండంత బలం అని పార్టీ కోసం కష్టపడ్డ నేతలు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత తప్పక లభిస్తుందని టీడీపీ పరిశీలకుడు పి.దినేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లయ్యకొండ కింద టీడీపీ మండల కమిటీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు, కార్యకర్తలు వర్గ విభేదాలు వీడి త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల వందశాతం విజయానికి కృషి చేయాలన్నారు. నేతలు, కార్యకర్తలు అందరికీ అందుబాటులో ఉండే నేతను ప్రతిపాదిస్తే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం మండల కమిటీ ఎన్నికపై నేతలు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి, చిట్టిబాబు, వెంకటేష్, రెడ్డప్పరెడ్డి, దేరంగుల చంద్ర, తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, సోము పాల్గొన్నారు.

టైపిస్ట్ ప్రశాంత్‌నాయక్ సస్పెన్షన్

సుండుపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లను జారీ చేసిన టైపిస్ట్ ప్రశాంత్‌నాయక్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం సస్పెండ్ చేశారు. అక్రమంగా జారీ చేసిన 27 పొసెషన్ సర్టిఫికెట్లను, 4 రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ప్రశాంత్‌నాయక్ తహసీల్దార్ అనుమతి లేకుండా డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన ఘటనను తహసీల్దార్ తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై రాజంపేట సబ్ కలెక్టర్ భావన విచారించి దుర్వినియోగానికి పాల్పడటం నిజమని ఇచ్చిన నివేదిక మేరకు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ మహబూబ్ చాంద్ మాట్లాడుతూ తమ కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్టు ప్రశాంత్‌నాయక్ వీఆర్‌వో, ఆర్‌ఐల లాగిన్‌లో ఏ విధమైన విచారణ నివేదిక లేకుండా, డిజిటల్ కీని వినియోగించుకుని పొసెషన్ సర్టిఫికెట్లను అక్రమంగా జారీ చేశారని పేర్కొన్నారు. దుర్వినియోం జరిగిన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతో పాటు పోలీసు కేసు పెట్టామని తెలిపారు. దీంతో కలెక్టర్ టైపిస్టును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం జోలికొస్తే ఎవరినీ వదలం

కర్నూలు సీసీఎఫ్ కృష్ణమూర్తి



ఎర్రచందనం చెట్లను పరిశీలిస్తున్న సీసీఎఫ్ కృష్ణమూర్తి

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం జోలికి వెళితే ఎంతటివారినైనా సహించేది లేదని కర్నూల్ రేంజ్ సీసీఎఫ్ కృష్ణమూర్తి హెచ్చరించారు. సిద్దవటం మట్టిరాజుల కోటను, లంకమల అభయారణ్యంలోని శాంభవి బేస్ క్యాంపును మంగళవారం ఆయన పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశీలించామన్నారు. డీఎఫ్‌వో వినోద్‌కుమార్, బద్వేల్ సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద, రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పెంచల్‌రెడ్డి, హైమావతి, మధుబాబు, మరికొందరు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి : మంత్రి

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మదనపల్లె రోడ్డులోని ఎంఎన్‌ఎం ఫంక్షన్ హాల్‌లో టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి బలం, బలహీనత కార్యకర్తలేనని, నాయకులు మారినా పార్టీకి అండగా నిలిచేది కార్యకర్తలేనన్నారు. అందరి సహకారంతోనే పార్టీ బలోపేతం అవుతుందని తెలియజేశారు. అనంతరం మండలాల వారీగా ఇన్‌చార్జిలను ప్రకటించారు. సంబేపల్లె క్లస్టర్ ఇన్‌చార్జిగా దుద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా శివప్రసాద్‌రెడ్డి, గాలివీడు క్లస్టర్ ఇన్‌చార్జిగా శివారెడ్డి, మండల ఇన్‌చార్జిగా కుమార్‌రెడ్డి, రామాపురం క్లస్టన్ ఇన్‌చార్జిగా వినోద్‌కుమార్, మండల ఇన్‌చార్జిగా సురేంద్రారెడ్డి, రాయచోటి రూరల్ క్లస్టన్ ఇన్‌చార్జిగా గాజుల ఖాదర్‌బాషా, మండల ఇన్‌చార్జిగా సుధాకర్, చిన్నమండెం క్లస్టర్ ఇన్‌చార్జిగా మల్లికార్జున, మండల ఇన్‌చార్జిగా రెడ్డెప్ప, లక్కిరెడ్డిపల్లె మండల ఇన్‌చార్జిగా యనమల మదన్‌మోహన్‌ను నియమించారు. వీరి ప్రమాణస్వీకారంతో పాటు గ్రామ, కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం విలేకరులతో మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

'మిషన్ శక్తి'తో మహిళల ఆర్థికాభివృద్ధి

మహిళల ఆరికాభివృద్ధిలో భాగంగా మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇందులో భాగంగా పట్టణం లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పేద మహిళలకు కుట్టుయంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎంపీడీవో సురేశ్‌బాబు, రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అయోధ్యాపురం ఆంజనేయులు, పలువురు టీడీపీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : సంబేపల్లె మండలంలోని పీఎన్ కాలనీ నగిరిలో అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలుపుకుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ, ఏడీఏ శ్రీలత, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వెంకటమోహన్, మండల వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మట్లి శ్రీనివాస్‌నాయుడు, మాజీ సర్పంచ్ గోపాల్, సుబ్బరాజుయాదవ్, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్

చిన్నమండెం: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఫోన్ చేసి తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

రాయచోటి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ వెల్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మనియానాయక్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ గుర్రప్ప, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

రాజంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ ఏసీబీ దాడులకు గురైన రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వ్యవహారంపై మంగళవారం కడప విజిలెన్స్ ప్రత్యేక తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఇక్కడ అవినీతి ఆరోపణలు రోజురోజుకు ఎక్కువ కావడంతో దీనిపై విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి విచారణకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఇందులో భాగంగా మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాని వచ్చిన విజిలెన్స్ అధికారులు కొన్ని రిజిస్ట్రేషన్‌లపై విచారణ చేసినట్లు తెలిసింది. ఒక వ్యక్తి చనిపోయిన నెల తర్వాత అతడి పేరిట రిజిస్ట్రేషన్ జరిగిన రిజిస్ట్రేషన్‌పై విచారణ చేసినట్లు తెలిసింది. స్టాంప్ రైటర్లు, వెండర్లు స్టాంపులను అధిక మొత్తంలో ఫిర్యాదులు రావడంతో దీనిపై ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి వ్యవహారం రోజురోజుకు మలుపు తిరుగుతోంది.

జాతీయ జట్టుకు మదనపల్లె విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ తదితరులు

మదనపల్లె అర్బన్, నవంబరు 25((ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీవేద పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నీరుగట్టి మోక్షరెడ్డి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మహేంద్ర తెలిపారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మదనపల్లె మండలంలోని గ్రీన్‌వాల్లీ పాఠశాలలో అండర్-14 బాలబాలికల జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. ఇందులో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబరు 18 నుంచి ఝార్ఖండ్‌లోని రాంచి జరిగే ఏపీ జట్టు తరపున జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననుంది.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మట్లి, పెద్దూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విదార్థులు కె.రెడ్డిగీత, సి.హేమశ్రీ, సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. నవంబరు 22 నుంచి 24వ తేదీ వరకు పులివెందులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రమణప్ప సత్రంలో జరిగిన పోటీల్లో కడప జిల్లా బాలుర, బాలికల జట్ల తరపున వీరు ప్రతిభ కనపరిచారు. జనవరి నెలలో ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు వల్లూరు జయన్న తెలిపారు. వ్యాయామ సంచాలకుడు ఎ.జగదీశ్వరయ్యను ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సిబ్బంది, పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగేశ్వర, గ్రామ ప్రజలు అభినందించారు.

ధనార్జన కోసమే చేతులు కలిపాం

- విచారణలో కీలక విషయాలు వెల్లడించిన నిందితులు

ములకలచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక ధనార్జన కోసమే మద్దేపల్లి జనార్దన్‌రావుతో చేతులు కలిపామని, నకిలీ మద్యం తయారీ ఫార్ములా అమలు, స్పిరిట్ సరఫరా, నగదు చెల్లింపులు అన్నీ తామే దగ్గరుండి చూసుకున్నామని ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీలో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీ వెల్లడించారు. మదనపల్లెలోని ఎక్సైజ్ స్టేషన్‌లో రెండోరోజు ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై కస్టడీకి తీసుకున్న ఆరుగురు నిందితులను విచారించారు.

నకిలీ మద్యం తయారీలో కీలకంగా వ్యవహరించిన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టా రాజు, బెంగళూరుకు చెందిన బాలాజీలను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. పలుమార్లు ఇద్దరిని వేర్వేరుగా, తరువాత కలిసి విచారించి కీలక విషయాలు రాబట్టారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి నగదు చెల్లింపులు తానే చేశానని, 2025 జూన్‌లో నకిలీ మద్యం తయారీ ప్రారంభించామని, బెల్ట్‌షాపులకు నకిలి మద్యం పంపానని, మొత్తం వివరాలను లాప్‌ల్యాప్, డైరీలో రాశానని కట్టా రాజు వెల్లడించినట్లు తెలిసింది. అలాగే కస్టడీలో ఉన్న కొడాలి శ్రీనివాసరావు, అష్రఫ్, చైతన్య బాబు, సుదర్శన్‌లను కూడా విచారించారు. ములకలచెరువు కేంద్రంలో నకిలీ మద్యం తయారు చేయడానికి ఫార్ములా అమలు చేయడంతో పాటు స్పిరిట్ రవాణా చేసిన బాలాజికి రూ.1.77 కోట్లు ముట్టజెప్పినట్లు కట్టా రాజు ఎక్సైజ్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్‌రావుపై కేసు

ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్‌రావుతో పాటు మరో ముగ్గురిని నిందితులుగా చేర్చారు. తంబళ్లపల్లె కోర్టులో మెమో దాఖలు చేసి అనుమతి ఇవ్వడంతో జగన్‌మోహన్‌రావును ఏ26గా, ఏ27గా తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఏ28గా రమేష్‌బాబు, ఏ29గా అల్లాబక్ష్‌లను చేర్చారు. వీరందరూ ఇబ్రహీంపట్నం కేసులోనే నిందితులుగా ఉన్నారు. వీరు అరెస్టయి ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్నారు. దీంతో ములకలచెరువు నకిలీ మద్యం నిందితుల సంఖ్య 25 నుంచి 29కి చేరింది. కాగా ప్రధాన నిందితుడు జనార్దన్‌రావును అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు.

ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలో ఆలయాల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించినట్లు జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సుద్దలవాండ్లపల్లె, మినమ రెడ్డిగారిపల్లె, శంకరాపురం, జగనన్న కాలనీ, దుద్యాల పెద్దజంగంపల్లె ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించినట్లు తెలియజేశారు. ఆలయ నిర్వాహకుల దరఖాస్తులను పరిశీలించి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలను మంజూరు చేసి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో భక్తిభావం పెంపొందించే విధంగా ఆలయాలు నిర్మిస్తామని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఆలయ నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఏఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయమే ఉపాధి కార్యాలయం

- ఇరుకు గదుల్లో ఇబ్బందిగా ఉద్యోగం
- ఆరు నెలలుగా తప్పని తిప్పలు
- ఇదీ డీబ్ల్యుఎంఏ కార్యాలయం దుస్థితి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లా ఏర్పడి మూడు సంవత్సరాలు దాటినా జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేవు. ఒకే భవనంలోనే రెండు మూడు కార్యాలయాలు నడుస్తున్నాయి. రాజంపేట రోడ్డులో ఉన్న మైనార్టీ కమిటీ బిల్డింగ్‌లో డ్వామా కార్యాలయం అప్పట్లో ఏర్పాటు చేశారు. అయితే ఆ కళాశాలకు సంబంధించిన యాజమాన్యం రెండు సంవత్సరాలు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉండటానికి వీలు లేదని చెప్పింది. ఆ భవనంలో హడావుడిగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని దాదాపు మూడు సంవత్సరాలు కాలం వెళ్లదీశారు. ఈ ఏడాది మే నెలలో అక్కడ ఉన్న కొన్ని కార్యాలయాలకు మైనార్టీ పాలిటెక్నిక్ యాజమాన్యం నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని చెప్పింది. దీంతో ఏం చేయాలో తెలియక హడావుడిగా దిగువ అబ్బవరం సచివాలయంలోకి డ్వామా కార్యాలయం రాత్రికి రాత్రి మార్చివేశారు. ఇక్కడ కనీస వసతులు కనుచూపు మేర లేవు. ఇరుకు గదిలో దాదాపు ఆరుగురు ఉద్యోగులు కూర్చుని పనిచేయాల్సి వస్తోంది. ఇక్కడ కొంతమంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. వారికి మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. జిల్లాలో అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే ఈ కార్యాలయానికి గూడు లేక నానా ఇబ్బందులు పడుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఉపాధి కార్యాలయం వారికి సరైన బిల్డింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు కోరుతున్నారు.

ఇబ్బందికరంగా ఉంది

మేము ఈ బిల్డింగ్‌లోకి వచ్చి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. ఇక్కడ మాకు సరిపడా గదులు లేవు. చాలా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్నాము. దిగువ అబ్బవరం సచివాలయంపైన బిల్డింగ్ మాత్రమే మాకు ఇచ్చి ఉన్నారు. కింద కూడా ఇచ్చి ఉంటే బాగుండేది. ఈ సచివాలయం కింద బిల్డింగ్‌లో ఉన్న ఉద్యోగులకు వెనుక ఉండే బిల్డింగ్ తయారు చేసి ఇస్తే బాగుంటుంది. అప్పుడు మాకు ఈ బిల్డింగ్ పూర్తిగా సరిపోతుంది. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి, మా డిపార్టుమెంట్ హెడ్ దృష్టికి కూడా తీసుకెళ్లాము.

- వెంకటరత్నం, డ్వామా పీడీ





సచివాలయంలో ఉన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం, చిన్న గదిలో విధుల్లో ఉన్న ఐదుగురు ఉద్యోగులు

మతిస్థిమితం లేని మహిళ మానసిక వైద్యశాలకు తరలింపు



మతిస్థిమితం లేని మహిళను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసు సిబ్బంది

చెన్నూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లె రోడ్డులో మతిస్థిమితం లేని మహిళను స్థానిక పోలీసులు మంగళవారం మనోబంధ్ ఫౌండేషన్ ద్వారా కడప నగరంలోని మానసిక వైద్యశాలలో చేర్పించారు. రెండు రోజులుగా ఆ మహిళ చెన్నూరు, కొక్కిరాయపల్లె గ్రామాల్లో తిరగడంతో పాటు ఆమె మాట్లాడే మాటలు కూడా అర్థం కాని ఇతర భాషల్లో ఉండడంతో ఆ మహిళను మతిస్థిమితం లేనిదని స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మహిళకు 30-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది.

జాతీయ స్థాయి పోటీలకు చంద్రమౌనిక


విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం, తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చంద్రమౌనిక 69వ జాతీయ స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టులో చోటుదక్కించుకుంది. ఫిజికల్ డైరెక్టర్లు విజయలక్ష్మి, ఉమాదేవి పర్యవేక్షణలో నిరంతర సాధనతో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో మెరిసిన మౌనిక గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, ఎంఈవో రఫీక్ అహ్మద్, పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గంగనపల్లె విద్యార్థినులు


ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన గంగనపల్లె విద్యార్థినులు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో ఈనెల 24 నుండి 25 వరకు జరిగిన అండర్-17 బాలబాలికల 69వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. బాలికల పోల్‌వాల్ట్ విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు వి.ముబీనా ప్రథమ, వి.సాహిదా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. డిసెంబరు 13 నుండి 17 వరకు ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఎర్రచందనం చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితులకు తిరుపతి కోర్టు మంగళవారం శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ చెక్‌పోస్టు సమీపంలో 2014 సెప్టెంబరు 21వ తేదీన 40కేజీల బరువు ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న సంపంగి రఘురాం, భూపాలం నాగరాజు, పోలిశెట్టి చంద్రశేఖర్, కొర్లకుంట తారకరామిరెడ్డిలను అప్పటి ఎస్ఐ టి.సంజీవరెడ్డి పట్టుకుని అదే రోజున కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈనేపథ్యంలో 2017 జనవరి 16న కమలాపురం కోర్టు జడ్జి ఆరునెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అయితే నిందితులు తిరుపతి రెడ్ శాండల్ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. అయితే తిరుపతి కోర్టు జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం సదరు నిందితులకు కింది కోర్టు విధించిన ఆరునెలల జైలు శిక్షను అమలుపరచాలని ఆదేశించారు. నిందితులను, సాక్షులను హాజరుపరచడంలో కృషి చేసిన సీఐ విశ్వనాథరెడ్డి, తిరుపతి కోర్టు లైసన్ ఆఫీసర్ హెచ్‌సీ సుబ్బయ్య, ఎర్రగుంట్ల హోంగార్డు ఎం.పుష్పరాజ్‌ను ఉన్నతాధికారులు అభినందించినట్లు సీఐ తెలిపారు.

కలిసిరాని ఉల్లి, అరటి సాగు

ఉల్లి, అరటి పంటల సాగు రైతులకు అచ్చిరాలేదు. కిందటి సంవత్సరం ఈ పంటలు సాగు చేసిన రైతులు మంచి లాభాలు గడించారు. ఇదే బాటలో ధరలు కొనసాగుతాయని ఆశించిన పలువురు సాగుకు పూనుకున్నారు. పరిస్థితులు వికటించి నష్టాలను మూటకట్టుకున్నారు. మండల పరిధిలోని రామాపురం రైతులు ఆ గ్రామంలో ఉల్లి, అరటి సాగుతో ఇంచుమించు రూ.2 కోట్లు పెట్టుబడుల కింద వెచ్చించి నష్టపోయారు. ఒకేఒక్క గ్రామంలో రైతులు ఇలా భారీగా నష్టపోవడం అరుదు అని పలువురు భావిస్తున్నారు.

- రామాపురం రైతులకు రూ.2 కోట్ల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతాంగం


చెట్టుకే వదిలేసిన అరటి గెలలు

దువ్వూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో వ్యవసాయమే జీవనాధారంగా కొనసాగుతోంది. ఇక్కడి రైతులు పండ్లు, కూరగాయలు, పూల తోటలతో పాటు ఉల్లి, అరటి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు కూడా సాగు చేస్తారు. ఈ క్రమంలో మంచి లాభాలు కూడా గడిస్తుంటారు. కానీ ఈ సంవత్సరం మార్కెట్‌లో ఉల్లి, అరటి పంటలకు సరైన డిమాండ్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వీటిని సాగు చేసి పెద్ద మొత్తంలో నష్టాలను మూటగట్టుకున్నారు. సరాసరి ఇక్కడ 300 ఎకరాల్లో ఉల్లి, 60 ఎకరాల్లో అరటి తోటలు సాగు చేశారు. పెట్టుబడుల కింద వీటి సాగుకు పెద్ద మొత్తంలో ఖర్చు అయింది. అయితే ఈ ఏడాది పొలంలో కురిసిన అధిక వర్షాలు, ఇతరత్రా కారణాల కారణంగా నేలలోనే ఉల్లిని, చెట్లపైనే అరటి గెలలను కొన్ని తోటల్లో గాలికొదిలేశారు. మరికొన్ని తోటలు ఇంకాకాపునకు రాలేదు. ఎకరాకు సరాసరి రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. ఉల్లి సాగుకు రూ.60వేలకు పైగా ఖర్చు వచ్చిందని చెబుతున్నారు. ఈ ప్రకారం రామాపురం గ్రామంలోని రైతులకు రూ.2 కోట్లు దాకా పెట్టుబడులకే వెచ్చించినట్లు తేటతెల్లం అవుతోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా కొనుగోలు జరుగకపోవడంతో చిల్లిగవ్వ కూడా చేతికందలేదని బావురమంటున్నారు.


పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

చిల్లిగవ్వ కూడా చేతికి అందలేదు..



అయిదు ఎకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి వేస్తే చిల్లిగవ్వ కూడా చేతికందలేదు. రూ.3 లక్షలు సాగు ఖర్చుల కింద వెచ్చించాను. పంటను నేలకొదిలేశాను. అప్పులు మూటగట్టుకున్నాను. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

- వైకుంఠం ఆంజనేయులు, రామాపురం

రూ.2.50 కోట్లు నష్టపోయాం..



మా ఊరిలో ఉల్లి, అరటి సాగు చేసిన రైతులు సుమారుగా రూ.2.50 కోట్లు నష్టపోయారు. వెనుక అదును వేసిన అరటి ఇంకా కాపు రాలేదు. ముందుగా వేసిన తోటల్లో గెలలు మాగడంతో గొర్రెల మేత కోసం వదిలేశాం. లేత తోటల్లో కాపు సమయానికి ధర వస్తుందని ఆశిస్తున్నాం.

- గుర్రం కొండలరావు, రామాపురం రైతు

ఎంపీ సీఎం రమేష్‌కు ఎమ్మెల్యేల పరామర్శ


అనకాపల్లి ఎంపి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ రాజు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎంరమేష్‌ను పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పోట్లదుర్తిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి రత్నమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వారంరోజులుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆమెను పోట్లదుర్తికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి ఇప్పటికి క్రిటికల్‌గానే ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎం.లింగారెడ్డి, షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, పలువురు ప్రముఖులు రత్నమ్మను మంగళవారం పరామర్శించి ఆమె ఆరోగ్యం పై ఎంపీ సీఎం రమేశ్‌ను, రమేశ్ తండ్రి మునిస్వామినాయుడుని, సీఎం సురేశ్, సీఎం రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం


వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేలు పట్టణానికి చెందిన వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బద్వేలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నన్ను ఎంతగానో ఆదరిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న బద్వేలు నియోజకవర్గ ప్రజానికానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ప్రారంభమైన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం నుండి కడపలో ప్రారంభమయ్యాయి. నగర శివారులోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టఆఫ్ నార్త్ జోన్- రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ జట్ల మధ్య సాగింది. తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ నార్త్‌జోన్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పి.పండిత్ 97 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్ చేపట్టి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 41 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మరో 220 పరుగుల వెనుకబడి వుంది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నార్త్‌జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 276 పరుగుల భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కేపీ శ్రీరామ్ 177 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టఆఫ్ సౌత్‌జోన్-సెంట్రల్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్టఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్ చేపట్టి 66.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 224 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె.కిశాల్ 74 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ఇందులో కె. థమన్‌సాయి 33 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు



గుర్రంకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీలోని సర్వే నెంబరు 421/2లో 7.77 ఎకరాల్లో తోపు పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలాన్ని కొందరు వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించి పొలాలు సాగు చేస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు రెండు రోజులు సర్వే చేసి హద్దులను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ సదాశివప్పనాయుడు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ములకలచెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నిపుణులు రత్నశేఖర్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, కృష్ణప్ప, జయచంద్రారెడ్డి, రేష్మా, అల్తాఫ్‌బాను, నిర్మలమ్మ, నోములమ్మ, ముస్తఫా పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఆర్టీసీ బస్టాండ్

- పై పూతలతో మ..మ.. అనిపిస్తున్న వైనం
- శ్రద్ధ చూపని డిపో అధికారులు


కడప బస్టాండ్ ప్లాట్‌ఫాం పైకప్పు దుస్థితి

కడప మారుతీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అది ఆర్టీసీ కడప రీజియన్‌కు గుండెకాయ లాంటి కడప డిపో. నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో సందడిగా వుంటుంది. కడప డిపో బస్సులే కాకుండా రీజియన్ పరిధిలోని మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల నుండి, అలాగే తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికుల తాకిడి మరీ ఎక్కువగా వుంటుంది. ఇదిలా వుండగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో గత ఆగస్టు 15 నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య మరింతగా పెరగడంతో బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. అందుకు తగ్గట్టుగా బస్టాండ్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం మంచి నీరు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా వుంచే ఏర్పాట్ల విషయంగా ఆయా డిపోల అధికారులు దృష్టిసారించాల్సి వుంది. అంతేకాకుండా బస్సుల రాక కోసం వేచివుండే ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలు, ఫ్యాన్లు వున్నాయి కానీ బస్టాండు బిల్డింగ్ మాత్రం అక్కడక్కడా పెచ్చులూడుతోంది. ఈ తంతు గత రెండు, మూడు సంవత్సరాలుగా సాగుతున్నా పై..పై పూతలతో మసి పూసి మారేడుకాయను చేసినట్లుగా మ....మ... అనిపిస్తున్నారు. బస్టాండ్ భవనంలోకి ప్రవేశించగానే కనిపించే కుడివైపున ఉన్న గదులు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఆ రూముల పైభాగం పెచ్చులు కింద పడేందుకు సిద్ధం అన్నట్లుగా వున్నాయి. వర్షం వస్తే చాలు బస్టాండ్ ఏటీఎం వద్దనున్న కిరాణా షాపుల వద్ద వర్షపునీరు పై నుంచి కురుస్తుంది. వర్షపు నీరు కింద పడకుండా ఎన్నితూ.. తూ మంత్రాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆ కోవలో బస్టాండ్‌లో బస్సులు నిల్చునే ప్లాట్‌ఫారం భవనం పైకప్పు అక్కడక్కడా పెచ్చులూడుతోంది. పై..పై మరమ్మతులతో సరిపెడుతున్నా పెచ్చులూడడం పరిపాటిగా మారింది. ఇటీవల కొంత భాగం పెచ్చులూడడంతో పైపై మెరుగులు దిద్దేందుకు పూనుకున్నారే కానీ ఎందుకో పని మొదలెట్టలేదనే వాదనలున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా వుండే ఆర్టీసీ కడప బస్టాండ్ భవనం పెచ్చు లూడే స్థితికి చేరుకున్నందున భవనానికి సరైన మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్కంఠగా అంతర్‌కళాశాలల క్రీడలు

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో జరుగుతున్న అంతర్‌కళాశాలల క్రీడా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. మంగళవారం వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. చెస్ ఫైనల్స్ పోటీల్లో ఉదయగిరి వ్యవసాయ కళాశాల, క్యారమ్స్ ఫైనల్స్‌లో బాపట్ల ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాల, బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో నైరా వ్యవసాయ కళాశాల, జట్టు విజయం సాధించాయి. అలాగే బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, 19 కళాశాలల స్టూడెంట్ యాక్టివిటీ అధికారులు, పీడీలు, సిబ్బంది హాజరయ్యారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోపీకృష్ణ

సీకేదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగ అధిపతి డాక్టర్ టి.గోపీకృష్ణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సాంకేతిక కార్యక్రమాలపై మంగళవారం సమీక్ష నిర్వహించి శాస్త్రవేత్తలకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం చింతకొమ్మదిన్నె మండలంలోని అసోసియేషన్ డీన్ ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డితో కలిసి ఇప్పెంట, జమాల్‌పల్లి గ్రామాల్లోని విద్యార్థులు క్షేత్రస్థాయిలో పొందుతున్న విజ్ఞానాన్ని, స్థానిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకుని అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యాన్ని పొందాలన్నారు. అనంతరం కేవీకే సిబ్బందితో కలిసి వర్మీకంపోస్టు కేంద్రాన్ని, పుట్టగొడుగుల పెంపకం, కోళ్లపెంపకం, గొర్రెలు, మేకల పెంపక కేంద్రాన్ని పరిశీలించారు. చిరుధాన్యాలకు విలువ జోడింపు కేంద్రాన్ని, యంత్రపరికరాలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కేవీకే, డాట్‌సెంటర్ సమన్వయకర్తలు అంకయ్యకుమార్, కృష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సీకేదిన్నె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిపై మద్దిమడుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ కరిమున్నీసా (32) మృతి చెందగా ఆమె భర్త పీరు బాషా, కుమార్తెకు గాయాలయ్యాయి. మంగళవారం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మద్దిమడుగు దాటిన తర్వాత ఘాట్ సమీపంలో రాయచోటి వైపు నుండి కడపకు వస్తున్న లారీ, కడప నుండి రాయచోటికి వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో కిందపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని అంగడివీధికి చెందిన కరిమున్నీసా అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అటువైపు వెళ్లే వాహనదారులు సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన రాత్రి 8 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కరిమున్నీసా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో రేపు సమీక్ష

తంబళ్లపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో 27వ తేదీన గురువారం ఇరిగేషన్ అధికారులు సమీక్షించనున్నట్టు పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్, సంఘ సభ్యులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ ధనుంజయరెడ్డి, ఏఈ సతీష్ హాజరై 2025-26 రబీ సీజన్ సంబంధించి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల నీటి విడుదలపై ఆయకట్టు రైతులతో చర్చించి వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లోని జుంజురపెంట, ఆర్ఎన్‌తండా, గోపిదిన్నె, కొటాల, బండ్రేవు, మందలవారిపల్లె, దిగువపల్లె తదితర గ్రామాల ఆయకట్టు రైతులు సమీక్షకు తప్పక హాజరు కావాలని శివకుమార్ కోరారు. కాగా, పెద్దేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో సుమారు.4,500 ఎకరాల ఆయకట్టు ఉంది.

శీతలం... ఉన్ని దుస్తుల మయం

● శీతాకాలం స్నేహితులు స్వెటర్లు! ● హైవేల్లోనూ ఉన్ని దుస్తుల విక్రయాలు ● అందుబాటులో విభిన్న రకాలు



పీలేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పొగమంచు, చలి మంట, వేడి వేడి టీ, అల్మారాలో దాచుకున్న స్వెటరు... ఇవన్నీ శీతాకాలపు మధుర జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలను మరోమారు కళ్ల ముందు నిలిపేందుకు చలికాలం వచ్చేసింది. వస్తూ వస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా చలిని, చలిగాలులను తోడు తెచ్చింది. దీంతో చాలా మంది తమకు అమ్మమ్మలు, నాయనమ్మలు నేసిన స్వెటర్లు, అమ్మానాన్నలు కొనిచ్చిన స్వెటర్లు బయటకు తీస్తున్నారు. మరికొందరు మాత్రం పాత ఫ్యాషన్లు మాకొద్దు అంటూ హుడీలు, స్వెట్ షర్టులు, థెర్మల్స్ అంటూ షాపింగ్‌కు బయలు దేరుతున్నారు. పీలేరు సహా పరిసర ప్రాంతాల్లోనూ గడిచిన వారం రోజులుగా చలి తీవ్రత పెరగడంతో పట్టణంలోని వస్త్ర దుకాణాలు, ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాల్లోనూ ఉన్ని దుస్తుల క్రయవిక్రయాలు పెరిగాయి. సాధారణ స్వెటర్లు, ఆధునిక యువత అభిరుచులకు అనుగుణంగా ఆయా దుకాణాల్లో వివిధ ఆకృతుల్లో స్వెటర్లు లభ్యమవుతున్నాయి.

ఉన్ని దుస్తులకు పెరుగుతున్న గిరాకీ

వారం రోజులుగా జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటున్నా పగలు సైతం చలి గాలులు వీస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు, సాయంత్రం 6 గంటల తరువాత చాలా మంది బయటకు రావాలంటే వణుకుతున్నారు. చలి తీవ్రత కారణంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బంది పడుతుండగా, బయట తిరిగే వారు సైతం స్వెటర్లు వేసుకోవాల్సి వస్తోంది. దీంతో పట్టణంలో స్వెటర్లు, హుడీలు, స్వెట్ షర్టులు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లకు గిరాకీ పెరిగింది. దుకాణాల్లో, ఫుట్‌పాత్‌పై వాటిని విక్రయిస్తున్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కొందరు వ్యాపారులు అప్పుడప్పుడూ ఉన్ని దుస్తులు తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. సాధారణ స్వెటర్లు యువతకు అనుకూలమైన బటన్, జిప్, బనియన్, థెర్మల్స్ వంటి విభిన్న రూపాలు, రంగుల్లో వాటిని అమ్ముతున్నారు.

పుల్ ఓవర్ స్వెటర్లు

దుస్తులకు పై నుంచి వేసుకునే ఈ స్వెటర్లు విద్యార్థులు, ఉద్యోగుల్లో ఎక్కువ ఆదరణ పొందుతున్నాయి. రౌండ్ నెక్, వి-నెక్ మోడళ్లలో లభించే పలు స్వెటర్లు తేలికగా ఉండి శరీర వేడిని నిలపడంలో సహాయపడతాయి. కార్డిగాన్ స్వెటర్లు ఫ్రంట్ బటన్‌లు లేదా జిప్ ఉన్న ఈ మోడల్స్‌ను మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఉపయోగిస్తారు. ధరించడానికి ఎంతో సౌకర్యంగా ఉండడంతో వీటికి నిత్యం డిమాండ్ ఉంటుంది.

హుడీలు:- యువతలో విపరీతంగా పాపులర్ అయిన హుడీలు స్టైల్, వేడిని కూడా అందిస్తాయి. క్యాప్ ఉండడం వల్ల చలి నుంచి తలకు సైతం రక్షణగా ఉంటుంది. కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు, వీటిని అధికంగా వాడుతున్నారు.

జాకెట్లు:- తేలికగా ఉండి శరీరాన్ని వేడిగా ఉంచే జాకెట్లను ఎక్కువగా ప్రయాణాలు, అవుట్ డోర్ కార్యక్రమాలకు అనువైనవి. చలి ఎక్కువ ఉండే ప్రాంతాల్లో వీటి వినియోగం అధికం. నెట్ స్వెటర్లు చేతితో లేదా మెషిన్‌తో నేసిన ఈ స్వెటర్లు వివిధ డిజైన్లలో లభిస్తూ మహిళలు, పిల్లలు ఎక్కువగా ఇష్టపడే దుస్తులుగా మారాయి.

థర్మల్స్:- ఇవి లోదుస్తుల్లాగా ధరించేవి. తేలికగా ఉండి, శరీర ఉష్ణోగ్రతను నిలుపుతాయి. పర్వతాల్లో పుట్టిన ఉన్ని దుస్తుల సంప్రదాయం శరీర రక్షణతో మొదలైన స్వెటర్ ప్రస్థానం బ్రిటీష వారి ప్రభావం, పారిశ్రామిక వికాసంతో నేడు ఆధునిక ఫ్యాషన్ ప్రపంచం వరకు విస్తరించింది. నేటి స్వెటర్లు సంరక్షణ+సంప్రదాయం+స్టైల్ కలయికగా నిలుస్తున్నాయి.



పీలేరు యల్లమంద క్రాస్‌లోని దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి



స్టైలిష్‌గా ఉండాలని కోరుకుంటున్నారు



నేటి యువత స్వెటర్లు కూడా స్టైలిష్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా అనేక బహుళ జాతి సంస్థలు ఉన్ని దుస్తులను వివిధ రూపాలు, విభిన్న ఫ్యాబ్రిక్స్‌తో తయారు చేస్తున్నాయి. యువత అభిరుచులకు సరిపోయేలా మేము కూడా ఆధునిక హుడీలు, థెర్మల్స్ జాకెట్లు తెచ్చి విక్రయిస్తున్నాం.

ప్రకాశ్, రెడీమేడ్స్ దుకాణం నిర్వాహకుడు, పీలేరు

వారం రోజులుగా అమ్మకాలు పెరిగాయి



వారం రోజులుగా చలిగాలులు వీయడం, మంచు కురుస్తోంది. ఫలితంగా మా వద్ద స్వెటర్లు, మఫ్లర్లు, మంకీ క్యాప్‌ల అమ్మకాలు పెరిగాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో చాలా మంది కొనుక్కుంటూ ఉంటారు. హైవే పై ప్రయాణాలు చేసేవారు, స్కూటర్లలో వెళ్లే వారు మా వద్ద నిలిచి మరీ కొనుగోలు చేస్తుంటారు.

సుబ్రహ్మణ్యం, ఫుట్ పాత్ వ్యాపారి, పీలేరు

రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగింపు

తంబళ్లపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె-ములకలచెరువు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను మంగళవారం ఎక్స్‌కవేటర్ ద్వారా పంచాయతీ అధికారులు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ములకలచెరువు రోడ్డుకు ఇరువైపులా తంబళ్లపల్లె నుంచి హైస్కూల్, మోడల్ స్కూల్ వరకు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో అటుగా వెళ్లే విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై స్థానిక నేతలు, ఆటో, వాహనదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రత్యేకాధికారి అమర్‌నాథ్ రెడ్డి, ఎంపీడీఓ బాహూజీ పట్నాయక్ ఆదేశాలతో మంగళవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్‌తో కలిసి ఎక్స్‌కవేటర్ ద్వారా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, చెత్తదిబ్బలను తొలగించారు.

మహిళలు అన్యాయాన్ని ఎదుర్కోవాలి



న్యాయాధికారి జయలక్ష్మిని సన్మానిస్తున్న మహిళా అధ్యాపకులు

మదనపల్లె టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా హక్కులపై అవగాహన పెంచుకుంటే వారికి జరిగే అన్యాయాలను ఎదుర్కోవచ్చని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు వచ్చాయన్నారు. నిర్భయ చట్టం, వరకట్న నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం తదితర వాటిపై విద్యార్థినులు అవగాహన కల్పించుకోవాలన్నారు. జీవితంలో పురుషుల నుంచి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు వనజ, విష్ణుప్రియ, మోహనవల్లి, మోహన్‌బాబు, ఖాజావలి, జ్యోతి, గురుమూర్తి పాల్గొన్నారు.

మహిళలపై కొనసాగుతున్న వివక్ష : సీడీపీఓ



ఇందిరమ్మ కాలనీలో మహిళలపై జరుగుతున్న వివక్షపై ర్యాలీ

పీలేరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కొత్త చట్టాలు తీసుకొస్తున్నా మహిళలపై ఇంకా సమాజంలో వివక్ష కొనసాగుతోందని ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ తెలిపారు. మంగళవారం పీలేరు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. కే. రాజమ్మ, కే. గట్టప్ప, హెచ్ఎం ఓబుల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణ, పలువురు అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు, రేపు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కలకడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లిలో రెండు రోజులు అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని దాతలు తెలిపారు. మొదటి రోజైన బుధవారం పూజ కార్యక్రమాలు, అన్నదానం ఉంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



సర్వే నిర్వహిస్తున్న ఏపీడీ, మండల అధికారులు

పెద్దతిప్పసముద్రం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డ్వామా ఏపీడీ నందకుమార్‌రెడ్డి అన్నారు. రెండోరోజు జరిగిన రైతన్నా... మీకోసం కార్యక్రమంలో మండల స్థాయి నేతలతో కలిసి పీటీఎంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి రైతుల వివరాలు తెలుసుకున్నారు. రానున్న ఐదేళ్లలో రైతులను రాజుగా చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులింటికి నేరుగా వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలను సేకరించారు. ఆ వివరాలు ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బందికి ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఇంటి వద్దకు వెళ్లి వ్యవసాయంలో మెలుకువలను వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ మస్తాన్, డిల్లీబాబు, వీఆర్వో లలిత కుమారి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతుకు లాభసాటి వ్యవసాయం అందిద్దాం

కురబలకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి నాగరాజు, ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. కురబలకోటలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఇంటింటి సర్వేలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు మరింతగా అభివృద్ధి చెందడానికి తీసుకోవాల్సిన సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు.

భవన నిర్మాణానికి స్థలం చూపాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

వాల్మీకిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ పామిలేటికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ వాయల్పాడు తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారి సమావేశాలు నిర్వహణ సమస్యల పరిష్కారం సభ్యులంతా ఒక చోట ఉండి సంఘాన్ని నడుపుకోవడం కోసం భవన నిర్మాణం తలపెట్టామని, ఇందుకు అవసరమయ్యే స్థలాన్ని తమకు చూపాలని తహసీల్దార్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ త్వరలోనే సర్వేయర్ సహకారంతో స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్దారెడ్డి, సభ్యులు నజీర్‌సాహెబ్, శంకర్‌రెడ్డి, శంకరయ్య, రాజగోపాల్, చిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

వాల్మీకిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలు చట్టాల పట్ల పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, అందుకు అమలులో ఉన్న చట్టాలను తెలియజేశారు. బాధిత మహిళలు కోర్టుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివరామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవిప్రకాష్, ఏజీపీ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మసముద్రంలో సినిమా షూటింగ్

బి.కొత్తకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుమ్మసముద్రంచెరువు పరిసరాల్లో మంగళవారం సినిమా షూటింగ్ జరిగింది. నాయనబావి పంచాయతీ కమ్మాలపల్లికి చెందిన రాజేష్‌రెడ్డి స్వీయ దర్శకత్వంలో తన సోదరుడు కార్తీక్‌రెడ్డిని హీరోగా పరిచయం చేస్తూ ఓ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రేమ, విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో ఉండబోయే ఈ సినిమాలో తెలంగాణ అమ్మాయి హీరోయిన్‌గా సినీ పరిశ్రమకు నూతన పరిచయం అవుతున్నట్లు దర్శక, నిర్మాత రాజేష్ రెడ్డి తెలిపారు. నాలుగు రోజులుగా నాయనబావి, మెగసాలమర్రి, గుమ్మసముద్రం గ్రామాల్లో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎగబడుతున్నారు. హార్సిలీహిల్స్‌లో సైతం షూటింగ్ చేసుకునేందుకు చిత్రం యూనిట్ టూరిజం మేనేజర్ కొల్లి శ్రీధర్ అనుమతులు తీసుకున్నారు. గురువారం నుంచి హార్సిలీహిల్స్‌పై ఈ సినిమా సన్నివేశాల చిత్రీకరణ జరగనున్నట్లు దర్శకుడు రాజేష్‌రెడ్డి తెలిపారు.

పీలేరు రెవెన్యూ డివిజన్‌పై సంబరాలు



గుర్రంకొండలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు

గుర్రంకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ప్రకటించడంపై గుర్రంకొండలో మంగళవారం సాయంత్రం టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బస్‌స్టాండులో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. పీలేరు రెవెన్యూ డివిజన్ కావడానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కృషి ఉందని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలి

పీలేరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మేకలవానికాల్వలో ఎన్‌ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజ హితం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు సమాజంలో రోల్‌మోడల్‌గా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో సేవ చేయడానికి ఎన్‌ఎస్ఎస్ ఒక అద్భుత అవకాశమని, విద్యార్థులు దీనిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ బీసీ. జయలక్ష్మీదేవి, ఎన్‌ఎస్ఎస్ పథక అధికారులు రామచంద్ర, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో 300 మందికి ఉచిత వైద్యం

గుర్రంకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజంపేట టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 300 మందికి బీపీ, షుగర్, జ్వరం, రక్తపరీక్షలను నిర్వహించి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామంలో చాలా మంది పేదలు వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్నట్లు చెప్పారు. సర్పంచ్ ప్రేమకుమారి, నేతలు విజయ్‌కుమార్, హరియాదవ్, రామచంద్ర, నక్కా సతీష్‌కుమార్, మధు, డాక్టర్లు గంగాధర్, వసీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2025 ఇండియా క్రౌన్ విన్నర్ విజయలక్ష్మి హల్‌చల్



బి.కొత్తకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 2025 ఇండియా క్రౌన్ విన్నర్ విజయలక్ష్మీ కవ్వం మంగళవారం హల్‌చల్ చేశారు. దేశరాజధాని ఢిల్లీలో జూలై27న జరిగిన గ్రాండ్‌ఫినాలేలో విజయం సాధించి ఎంఆర్ఎస్ ఇండియా క్రౌన్ సాధించారు. అనంతరం 2026లో అమెరికాలో జరగబోయే ఇంటర్నేషనల్ పోటీలకు ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆమె తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన విజయలక్ష్మి తన సమీప బంధువు, పీపల్ ట్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఇందిర నివాసానికి చేరుకుని వారితో సరదాగా గడిపారు. విజయలక్ష్మిను పట్టణ వాసులు కలిసి సెల్ఫీలు తీసుకున్నారు.

తాలుకా పోలీస్ స్టేషన్ తనిఖీ

మదనపల్లె అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్‌స్టేషన్‌ను మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, వన్‌టౌన్, మదనపల్లె రూరల్ సీఐలు మహమ్మద్‌రఫీ, రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల ర్యాలీ

ములకలచెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో మంగళవారం స్వయం సహాయ సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్వయం సహాయ సంఘాల మహిళలకు జెండర్ సమానత్వం కోసం నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల ప్రారంభం సందర్భంగా ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలి

కలకడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో వివక్షకు తావు లేకుండా ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. నయీ చేతన 4.0లో భాగంగా మంగళవారం కలకడలో ర్యాలీ, మనవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం పురుషోత్తంరెడ్డి, సీసీలు. సంఘమిత్రలు. స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బండ్లపై పంచాయతీ అటవీ ప్రాంతంలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా అందులో కొందరు తప్పించుకుని పరారైనట్లు తెలిపారు. ఇద్దరిని పట్టుకుని వారి నుంచి రూ.17150ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు, పరారైన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

మరమ్మతులు చేయించండి

మదనపల్లె టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డిని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలో మంత్రిని, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులురెడ్డిని ఆయన కలిశారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో బుధవారం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవ స్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో

మదనపల్లె అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె రోడ్డులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రమణ్యం, అనురాధ తెలిపారు. ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం వేలాయుధస్నానం, ప్రాకారోత్సవం, స్వామివారి కల్యాణోత్సం నిర్వస్తారన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఆయల ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ధర్మకర్తలు పేర్కొన్నారు.

కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో

కలకడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం 4కు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అభిషేకం, పంచామృతాభిషేకం, పుణ్యాహవచనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.